ఆయుర్వేద మార్తాండుడు

పండిత దీవి గోపాలాచార్యులు



సాహితీ సింధు డా॥ జి వి పూర్ణచందు, బి.ఎ.ఎం.ఎస్

శతాధిక గ్రంథకర్త, తెలుగువారి ఆహార చరిత్ర పరిశోధకులు,

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళారత్న (హంస) మరియు బోయి భీమన్న పురస్కారాల గ్రహీత

ప్రచురణ

దివి ఐతిహాసిక పరిశోధక మండలి

గాంధీక్షేత్రం, అవనిగడ్డ - 521121

ఆయుర్వేద మార్తాండుడు

పండిత దీవి గోపాలాచార్యులు

Ayurveda Martaandudu
Pandita Divi Gopalacharyulu

A Short Biography

By ***Dr. G V Purnachand,*** *B.A.M.S.,*

First Edition:

10–10–2025

దివిసీమ భావదేవరపల్లిలో
పండిత గోపాలాచార్యులవారి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా
విడుదల.

వెల: అమూల్యం

ప్రచురణ:

దివి ఐతిహాసిక పరిశోధక మండలి

గాంధీక్షేత్రం, అవనిగడ్డ – 521121

ముద్రణ:

ఆయుర్వేద పరిరక్షణే ధ్యేయంగా...

- **మండలి బుద్ధప్రసాద్,**
శాసన సభ్యులు, అవనిగడ్డ

ఆయుర్వేద మార్తాండ, భిషఙ్మణి, బ్రిటన్ మహారాజు 5వ జార్జ్ నుండి "వైద్యరత్న" బిరుదు అందుకున్న అపర ధన్వంతరీ అవతారం, దివి మణిదీపంగా తెలుగు జాతికి వెలుగునిచ్చిన మహోన్నతుడు పండిత దీవి గోపాలాచార్యుల వారి విగ్రహ ప్రతిష్ఠాపన ఇన్నాళ్ళకు సాధ్యపడింది. ఈ సందర్భంగా వారి జీవితంలో కొన్ని ముఖ్య ఘట్టాలను ఈ నాటి తరానికి విశ్లేషించి అందించాలనే ప్రయత్నమే ఈ పుస్తకం.

ఆయుర్వేదమే తన స్వరూపమని భావించి, తానే ఆయుర్వేదంగా జీవించి కృషి చేశారు పండిత దీవి గోపాలాచార్యులవారు. భారతదేశంలో ఆయుర్వేదానికి పూర్వవైభవం తీసుకు వచ్చిన మహానుభావుడు. ఆయుర్వేదాన్ని అణచాలని బ్రిటిష్ ప్రభుత్వ కుట్రల మధ్య ఆయుర్వేద శక్తిని చాటి దానిని పరిరక్షించారు. ఆయుర్వేద వైద్యానికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన కర్మయోగి ఆయన.

నైవేద్యం, వైద్యం, సేద్యం ఈ మూడూ ప్రధానాశాలుగా తీసుకుని దివిసీమను నమ్ముకుని శతాబ్దాలుగా జీవిస్తున్నవంశీకులు దీవి వారు. వీరి పూర్వీకులు కృష్ణా–సాగర సంగమ తీరమైన" హంసలదీవిలో స్వయంభువుడైన శ్రీ వేణుగోపాలుని సేవ చేస్తూ, వంతుల పంపిణీలో భావదేవరపల్లె యందలి "శ్రీభావనారాయణు"ని అర్చిస్తూ మూడు శతాబ్దాలుగా అక్కడే స్థిరపడ్డారు.

గోపాలాచార్యుల వారి తండ్రి రామకృష్ణమాచార్యులు తల్లి రాజ్యలక్ష్మి. వీరి సంతానంలో గోపాలాచార్యులే జ్యేష్టులు. హంసల దీవి వేణుగోపాలస్వామిని సేవించిన వారవటాన ఆయనకు కులదైవం గోపాలాచార్య పేరు పెట్టి ఉంటారు తల్లిదండ్రులు. గోపాలాచార్యులవారి తరువాత శ్రీయుతులు రంగాచార్యులు, సీతారామాచార్యులు, లక్ష్మణాచార్యులు, సత్యనారాయణాచార్యులు, లక్ష్మణ దేశికాచార్యులు మగసంతానం కాగా కుమార్తెలు రామానుజమ్మ, రంగమ్మ కలిగారు.

గోపాలాచార్యుల వారి ధర్మపత్ని రమణమ్మ. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె కలిగారు. కుమారుడు శ్రీనివాసాచార్యులు, కోడలు మంగతాయారమ్మ. చేతికి అందివచ్చే సమయంలో గొప్ప సంస్కృత పండితుడైన శ్రీనివాసులు ఆ తండ్రిని, భార్యనీ వదలి పరలోకగతుడయ్యారు. గోపాలాచార్యుల వారి కుమార్తె పుష్పవల్లీ తాయారు. అల్లుడు అగ్నిహోత్రం పార్థసారథి. వైద్యం చదువుతూ పార్థసారది కూడా పరమ పదించారు.

గోపాలాచార్యులవారి సోదరులు కూడా అల్పాయుష్కంగానే గతించారు ఒకే ఒక్కడుగా చివరి తమ్ముడు దేశికాచార్లు మాత్రమే చివరి దాకా అన్నగారికి అండగా నిలిచారు.

శంకరాచార్యులు, వివేకానంద స్వామి వంటి మహానుభావులు చిన్నవయసులోనే పరమపదించినట్టు, యావద్దేశాన్ని ప్రభావితం చేసిన గోపాలాచార్యులవారు కూడా యాభై యేళ్లయినా రాకుండానే మరణించటం ఆశ్చర్యం అనిపిస్తుంది. వేల సంఖ్యలో ప్రజల్ని ప్లేగు బారిన పడకుండా ఆయువు పోసి అపర ధన్వంతరిగా పేరొందిన ఆ ఆయుర్వేద మార్తాండుడికి భగవంతుడు మాత్రం సంపూర్ణ ఆయువు పొయ్యలేకపోయాడు.

22-10-1872 వ సంవత్సరమున సూర్యోదయాది 10 ఘడియల 15 విఘడియలకు భూమ్మీద అవతరించిన గోపాలాచార్యులవారు తన 48వ యేట 22-09-1920న వైకుంఠం చేరారు.

గోపాలాచార్యులవారు తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు కూడా! లాల్ బాల్ పాల్ త్రయానికి అత్యంత సన్నిహితులు. జాతీయోద్యమం ఒక రూపు దిద్దుకుంటున్న దశలో ఆయన దేశీయతను దేశీయ సంస్కృతిని దేశీయ కళలను దేశీయ వైద్యాన్ని ప్రజలు, ప్రభుత్వం కూడా గుర్తించే విధంగా పోరాటాలు చేసిన యోధుడు.

బ్రిటిష్ ప్రభుత్వం దిగివచ్చి ఆయన కోరినట్లు ఆయుర్వేదానికి సమప్రాధాన్యత నివ్వటం గోపాలాచార్యుల వారి విజయం. ఆనాటి కథలు ఆయన మరణించిన 105 యేళ్ల తరువాత కూడా నేటికీ స్ఫూర్తిదాయకమైనవే!

గోపాలాచార్యులవారి పట్ల భక్తిప్రపత్తులతో "ఆయుర్వేద మార్తాండుడు పండిత దీవి గోపాలాచార్యులు" అనే ఈ లఘు గ్రంథాన్ని రచించిన డా॥ జి వి పూర్ణచందు వృత్తి రీత్యా ఆయుర్వేద వైద్యులు. ప్రఖ్యాత రచయిత. పరిశోధకుడు కూడా! శతాధిక గ్రంథకర్త.

ఈ గ్రంథంలో గోపాలాచార్యులవారి కృషిని అనేక కోణాల్లోంచి విశ్లేషించి వివరించే ప్రయత్నం చేశారాయన. ఎన్నో కొత్త సంగతులను ప్రస్తావించారు. ఆయుర్వేదాన్ని కాపాడుకోవటానికి అటు ప్రభుత్వం, ఇటు ప్రజలు చేపట్టవలసిన చర్యల గురించిన ఒక అవగాహనని ఈ గ్రంథం కలిగిస్తుంది.

గోపాలాచార్యులవారి విగ్రహ ప్రతిష్ఠాపనకు గానీ, ఈ పుస్తక రచనకు గానీ, ఆ మహనీయుని స్ఫూర్తిని ఈ తరానికి అందించటమే లక్ష్యం.

ఒక మంచి గ్రంథ రచన చేసిన డా॥ పూర్ణచందుని అభినందిస్తున్నాను.

★★★

ముఖ్యఘట్టాలు

జననం

గురువు కోసం అన్వేషణ

మైసూరులో వైద్య విద్యాభ్యాసం

దేశాటన

బెంగళూరులో వైద్యుడిగా ఉద్యోగం

మైసూరు రాజ్యంలో ప్లేగు ఉధృతి

నెయ్యితో ప్లేగుని జయించారాయన

హైమాది పానకం

మద్రాసుకు ఆహ్వానం

మద్రాసులో ఉచిత ఆయుర్వేద వైద్యశాల స్థాపన

ఆయుర్వేద కళాశాల స్థాపన

ఆయుర్వేదానికి ఆధునిక దృక్పథం

ఆయుర్వేదాశ్రమ స్థాపన

ఔషధ తయారీ ఆధునీకరణ

ఔషధ నిర్మాతగా...

స్వాతంత్ర్య సమరంలో పోరాట యోధుడిగా

పనప్పాకం అనంతాచార్లుగారితో పరిచయం

బాల్యమిత్రుడు నాగేశ్వరరావు పంతులుగారు

ఆచార్య తిరుమల రామచంద్ర ఇలా వ్రాశారు

ఆంధ్ర విద్యానిధి ప్రకటన

ఆ విశాల వక్షస్థలానికి పతకాలే అలంకారం!

ఆయుర్వేద పునరుద్ధరణ కమిటీ

గోపాలాచార్యులవారు సాధించిన ఆయుర్వేద ప్రగతి

పానగల్లు రాజా కృషి

వైద్య చరిత్రకారుడిగా పరిశోధనలు

కె యన్ కేసరి వేరు కుంపటి

ఆచంట లక్ష్మీపతిగారు ఓ ఆయుర్వేద దీక్షితుడు

దీవి దేశికాచార్యులవారే వారసులు

చివరిగా ఒక మాట...



ఆయుర్వేద మార్తాండుడు

పండిత దీవి గోపాలాచార్యులు

– డా॥ జి వి పూర్ణచందు

వైద్యవేత్త, జ్ఞానమూర్తి, సత్యసంధుడు, దేశప్రజల హృదయాలలో చిరంజీవిగా నిలిచిన ఆయుర్వేద కర్మయోగి పండిత దీవి గోపాలాచార్యులవారు.

ఆయుర్వేదాన్ని చిదిమేయాలని ఆంగ్ల ప్రభుత కంకణం కట్టుకున్నప్పుడు, దేశంలో భారతీయ భైషజ్య దీపాన్ని వెలిగించి, వైద్యసేవా మార్గంలో శిఖరానికి చేర్చిన మహోన్నత సేవామూర్తి... తెలుగు వాడుగా జనించి, దివ్య దివిసీమ దీపమై వెలిగిన కారుణ్యమూర్తి ఆయన.

ధర్మం, కర్మ, జ్ఞానం, దయ, వినయం, ప్రజల సేవలో సాక్షాత్కారంఃఇవి ఆయన జీవితం.

నిఖిల దేశమూ గుర్తించిన వైద్య పండితుడిగా, నాయకుడు, పండితుడు, జనపదోధ్వంశ వ్యాధుల సంకట సమయాల్లో నివారకుడై ప్రతి రోగికి సాంత్వనగా ఆయుర్వేదాన్ని అందించిన అమృత కలశి ఆయన.

ప్రాచీన ఆయుర్వేద గ్రంథాలను సేకరించి, పరిశీలించి, వివిధ ఆయుర్వేద పద్ధతులను విస్తరించి సరళీకరించి, విద్యార్థులకు అందించటం ద్వారా భారతీయ వైద్యం దీర్ఘకాలం నిలిచేలా చేశారు.

కేరళ నుండి లాహోరు దాకా అఖండ భారతదేశంలో ఆయుర్వేద జ్యోతి ప్రకాశింపచేసిన వైద్యగురువు. రాగ–ద్వేషాలను దాటిన యోగిపుంగవుడు.

పండిత గోపాలాచార్యులు కేవలం ఆయుర్వేద పండితుడు, ప్రచారకుడు మాత్రమే కాదు, అపారమైన దేశభక్తి కలిగిన జాతీయతావాది కూడా. స్వాతంత్ర్య పోరాటానికి మద్దతుగా నిలబడి, స్వాతంత్ర్య సమరయోధులతో కలిసి కదిలారు.

తిలక్ సమకాలికుడాయన. ఇద్దరూ కొద్దిరోజుల వ్యవధిలోనే మరణించారు. కలిసి తిరిగి కలిసి వెళ్లిపోయారు.

ఆ ఇద్దరికీ సన్నిహితులైన ఆంధ్రపత్రిక వ్యవస్థాపకులు శ్రీ కాశీనాథుని నాగేశ్వర రావు 1921 ఆంధ్రపత్రిక ఉగాది ప్రత్యేక సంచికలో ఆ ఇద్దరి జీవిత చరిత్రలను ప్రత్యేకంగా ప్రచురించి నివాళులర్పించారు.

పైకి వినయంగా కనిపించినా, ఆయుర్వేద అభివృద్ధి కోసం తన స్వేచ్ఛను కాపాడడంలో ఆయన అణగదొక్కలేని సంకల్పి. ఆయుర్వేద రహస్య సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి,



జనసామాన్యానికి అందించేందుకు నిరంతరం కృషి చేశారు. శాస్త్రీయ దృష్టి కలిగిన పండితుడిగా సత్యం కోసం పోరాటం చేశారు. ఆయన కృషి వల్ల ఆయుర్వేదానికి కొత్త ఊపిరి వచ్చింది.

బ్రిటీష్ ప్రభుత్వపు నిర్లక్ష్య విధానాలపై ఆయన ధైర్యవంతమైన, స్పష్టమైన వ్యాఖ్యలు చేశారు:

"ఈనాటి ఆయుర్వేద స్థితి దురవస్థకుగల కారణం మన అజ్ఞానం, నిర్లక్ష్యం, బ్రిటీష్ ప్రభుత్వానికి మన శాస్త్రాలపై అనురక్తి లేకపోవడం. మన అభివృద్ధి వారికి పట్టదు."

జననం

దీవి గోపాలాచార్యులుగారి జననం గురించిన వివరాలను గణించి ఆచంట లక్ష్మీపతిగారు తేల్చిన తేదీ అక్టోబరు 10, 1872.

కృష్ణాజిల్లా, భావదేవరపల్లి (దివిసీమ)కి చెందిన సాంప్రదాయకవైద్య కుటుంబం వీరిది. మచిలీపట్టణంలో మాతామహులు శ్రీమాన్ అగ్నిహోత్రం కోదండరామాచార్యుల ఇంట జన్మించారు.

తండ్రి రామకృష్ణమాచార్యులు,తల్లి రాజ్యలక్ష్మమ్మల ప్రథమ సంతానంగా జన్మించారు. పదమూ డేండ్ల వయస్సువరకు మచిలీ పట్టణంలోనే తెలుగు సంస్కృతం చదివారు. స్వతహాగా వైద్యుల ఇంట పుట్టినవాడు కాబట్టి ఆయుర్వేద వైద్యం పట్ల ఆసక్తి మెండుగానే ఉంది. కానీ, అనుభవ వైద్యంగా కాకుండా శాస్త్రీయంగా ఆయుర్వేద వైద్యాన్ని చెప్పించాలని తండ్రి తలంపు. అందుకనే మొదట సంస్కృతభాషలో నిష్ణుతుడు కావాలని ఆ తండ్రి గోపాలాచార్యుల్ని ప్రేరేపించారు.

గురువు కోసం అన్వేషణ

గురువు లేని విద్య గుడ్డివిద్య. ఏ విద్య అయినా, నేర్చుకోవాలంటే గురువు అవసరం తప్పనిసరి. మనిషి జన్మించిన క్షణం నుంచే నేర్చుకుంటూ ఉంటాడు. ప్రతి మనిషి జీవితాంతం విద్యార్థే! ఈ విద్యను సరైన మార్గంలో అందించటానికి, మనలను సరైన దిశలో నడిపించడానికి గురువు అవసరం.

గురువు అనగా అంధకారాన్ని తొలగించే కాంతి. మనకు శాశ్వత ఆనందం, శాంతి, సత్య మార్గాన్ని చూపించే వారే సద్గురువులు. లోకంలో ఎన్నో సద్గురువులు ఉంటారు, కానీ, మనం వారిని గుర్తించడం, మనకు అనుగుణంగా గమనించడం ముఖ్యం.

గురువు శిష్యుణ్ని ఎన్నుకుంటాడు; కానీ, శిష్యుడు ఒక గురువును అంత తేలికగా ఎంచుకోలేడు. శిష్యుణ్ణి ఎన్నుకునే ప్రతిభ గురువుకున్నంతగా గురువును ఎంచుకునే ప్రతిభ శిష్యుడికుండదు కాబట్టి!



గురువు తన ప్రణాళికకు తగిన శిష్యుణ్ని తనవంటి వానిగా తీర్చిదిద్దుతాడు, ఆ బంధం జీవితాంతం నిలుస్తుంది. సాధకుడు ఎక్కడ, ఎప్పుడు గురువును పొందుతాడో ముందే తెలుసుకోవడం కష్టం. నిజమైన సాధకుడు అజ్ఞాత గురువుని కోసం ప్రార్థిస్తూ, నిత్య దైవారాధన చేస్తూ, అంతర్యామిని దర్శించడానికి ప్రయత్నిస్తే, ఆ గురువు అతన్ని వెతుక్కుంటూ వస్తాడు. గురువు లేని వ్యక్తికి శాంతి, ఆనందం పొందడం చాలా కష్టం.

పురందరదాసు చెబుతున్నట్టు, గురువుకు శరణుచెందకపోతే ముక్తి దొరకదు. ప్రతివారు తాము ఎన్నుకున్న గురువుకు ఆత్మ సమర్పణ చేసి, ధర్మమార్గంలో జీవిస్తే, శాంతి, ఆనందం సులభంగా లభిస్తాయి. ధనం, హోదా, సంతానం ఇచ్చే సుఖం కంటే, గురువు ఆశీర్వాదం ద్వారా లభించే ఆనందం శాశ్వతం.

విద్యార్థి బాల్యంలో పరిమిత విద్య ఉన్నా, గురువును వెతకడం, సాధన చేయడం తప్పనిసరి అని పేర్కొన్నాయి. వేదాలు, సూత్రాలు, సంహితల్ని విద్యార్థులు ప్రత్యక్ష గురువుల నుండి మాత్రమే నేర్చుకోవాలి. స్మృతులు, ఉపనిషత్తులు "స్వయంవిద్య" (self-study) కంటే, గురువుల పర్యవేక్షణలో మాత్రమే సత్యంగా గ్రహించదగినవిగా ఉంటాయి. గణితం, ఆయుర్వేద, సంగీతం, కవిత్వం గురువు లేకుండా నేర్చే విద్యలు కావు.

ప్రాథమిక విద్యాభ్యాసం బందరులోనే జరిగింది.5 యేళ్లొచ్చాక తాతగారు 1877లో మచిలీపట్నంలో ప్రాథమిక పాఠశాలలో చేర్పించి విద్యారంభం పలికారు. 14 యేళ్లొచ్చేవరకూ బందరులోనే చదివారు. అప్పటికే గోపాలాచార్యులకు 14 యేళ్లొచ్చాయి. లోకజ్ఞానం మెండుగానే ఉంది. ప్రాథమిక విద్యలు నేర్పిన గురువులు ఆయనకు లోకాన్ని అర్థం చేసుకునే శక్తినిచ్చే విద్యలు నేర్పారు. అందుకు ఆ గురువులకు ఆయనెప్పుడూ కృతజ్ఞుడే!

అయితే ఈ చదువులు తనకు చాలవనే అభిప్రాయం ఆయనలో బలంగా ఉండేది. ఒకరోజు ఇంట్లో చెప్పకుండా సన్యాసులతో కలిసి దేశాటన చేశారని, ఆ క్రమంలోనే హిమాలయ పర్యంతం సంచరించారని చివరికి తిరుపతి మహంతుల ఆశ్రయం దొరికిందని కొందరు చెప్తారు. ఈ కాలంలో సన్యాసులు, తత్వవేత్తలు, యోగులతో సమాగమం ఎక్కువగా జరిగిందాయనకి. వివిధ వాద ప్రతివాదాలలో పాలుపంచుకున్నారు. శాస్త్ర విషయాలను బాగా ఆకళింపు చేసుకున్నారు.

ఆ రోజుల్లో శాస్త్రాలన్నీ సంస్కృతభాషలోనే ఉన్నాయి కాబట్టి, సంస్కృతం మీద పట్టు దొరికితేనే శాస్త్ర విద్యల్లో పాండిత్యం అబ్బుతుంది. 1886లో తిరుపతిలోని మహంతు పాఠశాలలో సంస్కృతం వేద విద్యలూ చదివారు. అక్కడే ఆయనకు "ఆచార్య" బిరుదు లభించింది.

3యేళ్ల తరువాత భావదేవరపల్లి తిరిగి వచ్చారు. ఆ సమయంలో కుమారుడు ఇంటికి



తిరిగి వచ్చినందుకు ఆ తల్లిదండ్రులు ఎంత ఆనందపడి ఉంటారో చెప్పనవసరం లేదు. బాల్య వివాహాల రోజులు అవి! అతన్ని ఒప్పించి వివాహం చేశారు తల్లిదండ్రులు.

సంస్కృతం, వ్యాకరణం, తత్వశాస్త్రం మీద ఉన్న పట్టుదల ఆయుర్వేదాన్ని లోతుగా గ్రహించడానికి ఎంతో తోడ్పడింది. తిరుపతిలో ఉన్నప్పుడే ఆయుర్వేదంపై ఆయనలో ఆసక్తి మొదలైంది. సంస్కృతంలో ప్రతిభాసంపన్నత సాధించకొన్నాక ఆయుర్వేద ధ్యాస మరీ ఎక్కువ అయ్యింది. తిరుపతి నుండి తనకు ఆయుర్వేదం నేర్పే గురువు కోసం వెదకుతూ మైసూరు చేరారాయన,

నిజానికి తెలుగువారి రాజధానీ నగరం మద్రాసుకు చేరవలసినవారు గోపాలాచార్యులు.

మద్రాస్ నేరుగా బ్రిటిష్ వారి ఆధీనంలో ఉన్న రాజ్యం. ఆయుర్వేదాన్ని అణగదొక్కే ప్రయత్నాలను ముమ్మరం చేసింది అక్కడి బ్రిటిష్ ప్రభుత్వం. యథారాజా తథా ప్రజా కాబట్టి తెలుగు ప్రజలు కూడా అందుకుతగ్గట్టుగానే వ్యవహరించారా రోజుల్లో!

ఈ కారణం చేత మైసూరు రాజ్యం వైపు దృష్టి సారించారు గోపాలాచార్యులు. మైసూరు రాజ్యం బ్రిటిష్ అజమాయిషీలోనే ఉన్నప్పటికీ పాలనా వ్యవహారాలు స్వతంత్రంగా నిర్వహిస్తోన్నందున ఆయుర్వేదానికి అక్కడ ఆదరణ బావుండటం మైసూరు ఆయన ప్రయాణానికి ముఖ్య కారణం.

మైసూరులో వైద్య విద్యాభ్యాసం

మైసూరు అనగానే తంజావూరు సరస్వతీ మహల్ గ్రంథాలయంలో దర్శనమిచ్చే మైసూరు పెయింటింగులు గుర్తుకొస్తాయి. మైసూరు అనంగానే మైసూరు పట్టుచీరలతోపాటు జగత్ప్రసిద్ధమైన మైసూరు పాక్ అనే తీపి భక్ష్యం కూడా గుర్తుకొస్తుంది.

మైసూరు వీటికన్నా ప్రసిద్ధిపొందింది ఆయుర్వేదంలో! టిప్పు సుల్తాన్ మరణం తరువాత 1881లో బ్రిటిష్ పాలకులు మైసూరు రాజ్యాన్ని వొడయార్ పాలకులకు అప్పగించారు. అప్పటినుండి 1947 స్వాతంత్ర్యం సిద్ధించే వరకు మైసూరు నగరం రాజధానిగా, మైసూరు కోట పాలనాకేంద్రంగా వర్ధిల్లాయి. ఒడయార్ ప్రభువులు కళలతోపాటు కన్నడభాషని, బాగా పోషించారు. మైసూరు నగరాన్ని మైసూర్ పురపాలక సంస్థ (మునిసిపాలిటీ)గామార్చారు. రాజధాని నగరాన్ని సుందరీకరించి కవులకు కళాకారులకు శాస్త్రవేత్తలకు నిలయంగా మార్చారు. ఆసియాలో ప్రణాళికా బద్ధమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన తొలి నగరాలలో ఒకటిగా మైసూరును పేర్కొంటారు.

బ్రిటిష్ వారు ఆ రోజున ఒడయార్లకు రాజ్యాన్ని అప్పగించాలనే నిర్ణయం తీసుకోవటంలో చెట్టిపాణ్యం వీరవల్లి రంగాచార్యులనే బ్రిటిష్ ప్రభుత్వోద్యోగిది ముఖ్యపాత్ర! రాజుగా నియమితులైన చామరాజేంద్ర ఒడెయర్ మహారాజావారు రంగాచార్యులవారి కృషికి గుర్తింపుగా ఆయన్ని తన సంస్థానానికి తొలి దివానుగా నియమించారు



ఆ రంగాచారిగారు పదారణాల తెలుగు బిడ్డ. అంతేకాదు ఆయన కృష్ణాజిల్లా వీరవల్లిలో పుట్టి పెరిగినవాడు. గోపాలాచార్యుల పట్ల ఆయన అవ్యాజానురాగం చూపించారు.

మైసూరు ప్రశస్తిని వినడం వలన కానీ, ఒక తెలుగు వాడు దివానుగా ఉండటాన గానీ, ఆయుర్వేదం మీదకు ధ్యాస మళ్ళిన గోపాలాచార్యులవారు మైసూరు చేరటానికే మొగ్గు చూపారు.

1888లో మైసూరులోని మహారాజావారి ఓరియెంటల్ స్కూల్‌లో చేరారు, 1893లో ఆయుర్వేద విద్యను పూర్తి చేశారు.

సంస్కృత కళాశాలలో ఆయుర్వేద వైద్య విద్యలో ఐదేళ్లపాటు శిక్షణ పొందారు. 1893లో వైద్య విద్యాభ్యాసం పూర్తి చేశాక తనకు గల అపారమైన సంస్కృత పాండిత్యం వైద్య శాస్త్ర పాండిత్యం ఉపయోగించుకుని మరింత మెరుగైన చదువుల కోసం దేశ యాత్ర ప్రారంభించాడు. తగిన గురువు కోసం అన్వేషణ అలా మొదలయ్యింది.

మైసూరు మహరాజా కళాశాలలో అంగరం పొట్టస్వామి శాస్త్రులుగారు ప్రిన్సిపాల్‌గా ఉన్నారు.

దేశాటన

వైద్యగ్రంథాలు అనంతమైన వైద్య పర్జ్ఞానాన్ని నిక్షిప్తం చేశాయి. గురువులు మాత్రమే వాటిని విశ్లేషించి వివరించగలరు. చరకసంహిత మీద ప్రామాణికత కలిగిన పండితులు ఒకరైతే సుశ్రుత సంహిత మీద ప్రామాణికత కలిగినవారు వేరొకరు. వారిని ఆశ్రయించి, సుశ్రూష చేసి సందేహాలను తీర్చుకోవటం జిజ్ఞాస కలిగిన వైద్యుడి బాధ్యత. అలాంటి గురువులను అన్వేషిస్తూ ఆయన లాహోరు నుండి తిరువనంత పురం దాకా దేశాటన చేశారు. 1887లో హైదరాబాద్‌లో గోసాయి వైద్యులతో జరిగిన పరిచయం ఆయుర్వేద గ్రంథాలు, వ్రాతప్రతులు చదవడానికి ఆయనలో ఉత్సాహాన్ని రగిలించింది. ఆయన స్వయంగా పరిశోధనలు ప్రారంభించి, ఆయుర్వేదాన్ని మరింత లోతుగా అవగాహన చేసుకోవడానికి కృషి చేశారు.

ఈ పర్యటనల ద్వారా ఆయన జ్ఞానం, అవగాహన మరింత పెరిగాయి. తమిళనాడు, కేరళ ప్రాంతాల్లోని సిద్ధవైద్యులు, సంప్రదాయ గ్రంథాలతో పరిచయం ఆయనపై గొప్ప ప్రభావం చూపింది.

ఈ ప్రయాణాల్లో ఆయన అనేక ఔషధ మొక్కల నివాస స్థలాలను గమనించి, వాటి వైద్య వినియోగాన్ని లోక వైద్యుల ద్వారా అర్థం చేసుకున్నారు. "ఇంగ్లాండుకు ఇనుము, బొగ్గు గనులు ఉండి తమ దేశ అభివృద్ధికి తోడ్పడితే, భారతదేశానికి ఔషధ మొక్కలే నిజమైన గనులు" అన్నారాయన.



కలకత్తా, వారణాసి, బొంబాయిలలో ప్రసిద్ధ ఆయుర్వేద పండితులను కలిశారు. అనేక వైద్య రహస్యాల గురించిన సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకున్నారు. ఇలా ఎందరో ప్రముఖ వైద్యుల్ని కలిశారు. వారి నుండి సందేహ నివృత్తులు పొందారు. ఆయుర్వేద వైద్య శాస్త్రంలో తనకు క్షుణ్ణత ఏర్పడిందని నమ్మకం కుదిరాక బెంగళూరు చేరారు.

బెంగళూరులో వైద్యుడిగా ఉద్యోగం

1893లో బెంగుళూరులోని థియొసాఫికల్ సొసైటీ వైద్యశాలలో చికిత్సకుడిగా ఉద్యోగంలో చేరారు. థియోసాఫికల్ సొసైటీని మేడమ్ బ్లావెట్‌స్కీ అనే రష్యన్ వనిత 1875లో అమెరికాలో స్థాపించారు. తల్లాప్రగడ సుబ్బారావుగారు 1882లో ఈ సంస్థని దివ్యజ్ఞాన సమాజం పేరుతో మద్రాసులోని అడయారుకు మార్పించి ఆయనే నిర్వహించారు. విశ్వమానవ సౌభ్రాతృత్వం, అన్ని మతాల అంతిమ లక్ష్యం మోక్షం. ఈ మతాల తత్వంను తెలుసుకొనుట కొరకు వాటి అధ్యయనం,ప్రకృతిలో, మానవునిలోపల ఉండే అంతర్గత శక్తులను పరిశోధించటం లక్ష్యంగా ప్రాచీన హిందూమతం, బౌద్ధమతం, జుడాయిజాల సమ్మేళనం కోసం ఈ సమాజం ప్రయత్నించింది.

బ్లావట్‌స్కీ వ్రాసిన "రహస్య సిద్ధాంతం (ది సీక్రెట్ డాక్ట్రిన్)" చదివిన అనిబిసెంట్ ప్రభావితమై 1889లో దివ్యజ్ఞాన సమాజంలో చేరింది. దేశంలోని ప్రముఖ నగరాల్లో దివ్యజ్ఞాన సమాజం శాఖలు వెలిశాయి. ఆధ్యాత్మిక ఉన్నతిపైన అధ్యయనంతో పాటు మానసేవలో ఈ సంస్థ ప్రముఖ పాత్ర వహించింది. అనీబిసెంట్ చేరిక తరువాత ఈ సంథ సామాజికంగా ఎదిగిందనే చెప్పాలి.

ఇక్కడ అనీబిసెంటమ్మ ప్రస్తావనకు కారణం ఉంది. 24 యేళ్ళ కుర్రాడుగా ఉన్న గోపాలాచార్యులలో దాగున్న ప్రతిభను మొదటగా గుర్తించిన వ్యక్తి అనీబిసెంటే! అవతార పురుషులనదగిన వ్యక్తుల్లో దాగున్న అనంత శక్తిని ప్రేరేపించేందుకు కొందరు సద్గురువులు అవతరిస్తారు. అనీబిసెంట్ అలాంటి పాత్ర పోషించి, గోపాలాచార్యుల ప్రతిభకు ఒక గోడచేర్పు అవసరం కూడా!

1893లోఆమె ఆహ్వానం మీద దివ్యజ్ఞాన సమాజ ఆసుపత్రి బెంగళూరు శాఖ చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా ఆయన జీవితంలో తొలిసారిగా వృత్తిలో కుదురుకున్నారు. ఆదాయం కోసం కాకపోయినా అనుభవం కోసం ఒక కొత్త వైద్యుడికి మంచి అవకాశం ఇది!

ఓ ఐదేళ్లపాటు ఆయన అక్కడే చికిత్సకుడుగా కొనసాగారు.

మైసూరు రాజ్యంలో ప్లేగు ఉధృతి


1897 నుండి 1923 వరకు మైసూరు రాజ్యంలో ప్లేగు వ్యాధి నిరంతరంగా వ్యాపించింది.



మొదట బాంబే ప్రెసిడెన్సీ సరిహద్దులోని ధారవాడ జిల్లాలో హుబ్లీలో ఈ వ్యాధి ప్రబలంగా వ్యాపించింది. మైసూరుకు కేవలం 80 మైళ్ళ దూరంలో ఉండటంతో, వ్యాధి రాకుండా అడ్డుకోవడానికి అన్ని జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని భావించారుమైసూరు రాజావారు ముందుజాగ్రత్త చర్యల కోసం తక్షణ ఆదేశాలు జారీ చేశారు.

అయినా, 1898 ఆగస్టు 12న బెంగళూరు నగరంలో ప్లేగు మొదటగా కనిపించింది. అక్కడి నుండి అది మైసూరు, కోలార్, తుమకూరు జిల్లాల వైపు వేగంగా వ్యాపించింది. వ్యాధి అత్యధికంగా ప్రబలింది మొదటి ఏడాదిలోనే. అప్పుడు దాదాపు 15,000 మంది ఈ వ్యాధికి గురయ్యారు; వారిలో 12,000 మందికి పైగా మరణించారు.

మైసూరు రాజ్యంలో ప్రజలు స్వయంగా లాక్ డౌన్ పాటించినట్టు గుమ్మాలకు వేపమండలు కట్టి, తలుపులు మూసుకుని బైట" ఓ స్త్రీ! రేపు రా!" అని రాయసాగారు.



ప్లేగు బాధితుల కోసం నిర్మించిన ప్రత్యేక చికిత్సా శిబిరాలు

వేలసంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. ఈ వైద్య అత్యవసర పరిస్థితిలో, గోపాలచార్యుల వారిని మైసూరు ప్రభుత్వం ప్రత్యేక ప్లేగ్ ఆఫీసర్‌గా నియమించింది. ఆయుర్వేదంలోని తన వైద్య అనుభవంతో ఆయన తయారుచేసిన హైమాది పానకం, శతధౌత ఘృతం. అనే రెండు ఔషధాలు ప్లేగు చికిత్సలో అపారమైన ఫలితాలను ఇచ్చాయి. ఆయనకు దేశవ్యాప్తంగా ప్రశంసలు దక్కాయి.

"విదేశం నుంచి వచ్చిన పరికరమని తక్కువగా చూడకూడదు. పాశ్చాత్య వైద్య శాస్త్రం



వేగంగా ఎదుగుతున్నదని నిర్లక్ష్యం చేయకూడదు. అలాగే మనం ఆయుర్వేదానికి కొత్త మార్గాలను కనుగొని అభివృద్ధి చేయాలి” అన్నారాయన.

ఆయన మాటలు ఎల్లప్పుడూ స్పష్టంగా, విమర్శనాత్మకంగా ఉండేవి. సహచర వైద్యులకు ప్రేరణ కలిగించేవి.

“ఆయుర్వేద ఔషధాల తయారీకై కావాల్సిన పదార్థాలన్నీ మన దేశంలోనే లభ్యమవుతాయి. వాటి కోసం విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. మహాయుద్ధమో, ప్లేగో, ఫ్లూనో వచ్చినా మనకెంత కావాలంటే అంత పొందగలం.”

ఈ మాటలు ఈనాటి కోవిడ్-19 మహమ్మారి సందర్భంలో కూడా అద్భుతంగా వర్తిస్తాయి. అల్లం, మిరియాల్లాంటి మసాలా దినుసులు, కషాయాలు, రోగనిరోధక శక్తిని పెంపొందించే ఆయుర్వేద ఔషధాలు ఎంతగానో ఉపకరించాయి కూడా!

ప్రభుత్వం ఆనాడు కోవిడ్ వ్యాధికి చికిత్స చేయకుండా ఆయుర్వేదాన్ని కట్టడి చేసినా ప్రజలు ఇళ్ళలో అల్లం రసం తులసాకులు మిరియాల కషాయాలు తాగి వైరస్ బారి నుండి తమను తాము రక్షించుకునే ప్రయత్నం చేశారు. రెండో విడత కోవిడ్ వచ్చినప్పుడు లాక్ డౌన్ ఆంక్షలున్నప్పటికీ ఆనందయ్య గారి మందులకోసం ప్రజలు క్యూలు కడితే ప్రభుత్వం నిస్సహాయంగా చూస్తూ నిలబడిపోయింది. మొదటి విడతలోనే ఆయుర్వేద సలహాలు, ఔషధాలను స్వీకరించి ఉన్నట్టయితే ఎన్నో విలువైన ప్రాణాలను కాపాడుకోగలిగే వాళ్లం!

గోపాలచార్యులవారి జీవితమంతా ఒకే ధ్యేయంతో గడిచింది. ఆయుర్వేదాన్ని కాపాడటం, అభివృద్ధి చేయటం,ప్రజల్లో విస్తరింపజేయటం ఆయన లక్ష్యాలు. విద్యార్థులను, పండితులను ప్రేరేపించిన జీవమూర్తి. చిన్న వయసులోనే విద్యా, వైద్యరంగాల్లో అద్భుత ప్రమాణాల్ని నెలకొల్పి, ఆయుర్వేద వాణిజ్య రంగానికీ దారులు తీశారు.

మైసూరులో ప్లేగు ఉధృతిని కట్టడి చేయగలగటంతో గోపాలాచార్యులనే పాతికేళ్ల కుర్ర వైద్యుణ్ణి చూసి దేశం అంతా నివ్వెర పోయింది. అదీ స్వంతంగా తయారు చేసిన మందులతో...!

నెయ్యితో ప్లేగుని జయించారాయన

శతధౌత ఘృతం అంటే, వందసార్లు కాచి సంస్కరించబడిన నెయ్యి. నేతికి చలవచేసే గుణం ఉండటాన పిత్తదోషాన్ని, వేడిని, స్నిగ్ధగుణం కలిగింది కాబట్టి వాతాన్ని శమింప చేస్తుంది. నెయ్యీ, కఫం సమాన గుణాలు కలిగినవే అయినప్పటికీ సంస్కరించబడిన నెయ్యి కావటాన కఫ దోషాన్ని కూడా శమింపచేస్తుందని ఆయుర్వేద గ్రంథాలు పేర్కొన్నాయి. పావుచెంచా నుంచి అరచెంచాడు మోతాదులో తీసుకుంటే చాలు గొప్పగా పనిచేస్తుంది.



“జ్వరితోऽనేన నిర్వాతి ప్రదీప్తం చామ్బునా గృహమ్” ఇల్లు దగ్ధమౌతుంటే నీళ్లు మంటల్ని ఆర్పినట్టు తీవ్రమైన జ్వరాన్ని నెయ్యి చల్లబరుస్తుందని కాశ్యప సంహిత నెయ్యి గురించి పేర్కొంది. మహమ్మారిలాగా వ్యాపించి శరీరాల్ని తపింప చేసిన ప్లేగు వ్యాధి మొన్న వచ్చిన కోవిడ్ లాగానే వైరస్ కారణంగా వచ్చిన వ్యాధి. వైరస్ వలన రావటాన చాలా త్వరగా వ్యాపించింది. వేల సంఖ్యలో ప్రజలు ఒకేసారి దాని పాలిట పడ్డారు. యుద్ధప్రాతిపదికన ఈ ఔషధాన్ని భారీ ఎత్తున తయారు చేసి రోగులకు అందించ గలిగారాయన. అది తక్షణ నివారకంగా పనిచేసింది.

హైమాది పానకం

ఎమర్జెన్సీలో పనిచేసే మందు అనగానే ఆధునిక వైద్యంలో వేలాది రూపాయలు ఖరీదు పెడతారు. వైద్యానికన్నా వ్యాపారానికి అవకాశాలెక్కువ. ఇలాంటి సందర్భాల్లో మధ్య దళారీల ప్రమేయం లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే! కానీ, కరోనా ఉధృతి సమయంలో ఇష్టారాజ్యంగా వ్యాపారం సాగినా కిమ్మన్నాస్తిగా ఉండిపోయారంతా!

ప్లేగు వ్యాధి విజృంభించినప్పుడు ఆఖరికి మైసూరు మహరాజాగారు కూడా తన అంతః పురాన్ని ఖాళీ చేసి ఏకాంత జీవితంలోకి వెళ్ళి పోయారంటే ఆనాటి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అందుకనే తేలికగా దొరికే చవకైన ద్రవ్యాలతో ఫార్ములాని రూపొందించి జనసామాన్యానికి అందుబాటులోకి తేవాలని భావించారాయన.

అలా తయారైనదే హైమాది పానకం. పానకం అంటే సిరప్ అని! చేదుకట్టు మూలికలతో తయారైన ఔషధాన్ని పిల్లా జెల్లా అందరూ వేసుకోవటానికి అనువైన ఔషధం అది.

ఇదే అదనుగా జేబులు నింపుకునే ప్రయత్నం చెయ్యలేదాయన! సామాజిక దృష్టితో వైద్యుడిగా మారిన వారాయన!

ఇంతకీ ఈ ఫార్ములాలో ఏముందీ? దీవి గోపాలాచార్యుల వారి జీవిత చరిత్ర వ్రాసిన వైద్యులు డి. వి. ఏ ఆచార్య జిసిఐయం గారు ఈ ప్రశ్నకి చక్కని సమాధానం వ్రాశారు:

“రహస్యంగా యోగాలను దాచిపెట్టే పద్ధతి పోగొట్టి ఆయుర్వేదాన్ని వృద్ధి చేయు నిమిత్తం ఆయన ఆయుర్వేద కళాశాల పెట్టారు. అయితే వారు మాత్రం తన కలరా, ప్లేగు యోగాలను రహస్యంగా ఉంచారు. తన విద్యార్థులు ఈ రహస్యాన్ని తమ జ్ఞానం వల్ల కనిపెట్టాలని వారి ఆశయం.

ఈ రహస్యం తెలియక కళాశాల విద్యార్థులు అందరూ ఏకమై కళాశాల బహిష్కారం పేరుతో స్ట్రైక్ చేశారు.

ఈ విషయమై నేను ఆచార్యులు గారితో ప్రస్తావించగా యీ యోగాలలో ఏమీ రహస్యం లేదనియూ, హైమాదిపానకంలో హైమమనగా నేలవేము (భూనింబ–సుదర్శన) అనియు,



నేలవేము మొదలగు చేదు పదార్థములు వేసుకొనవచ్చుననియు, హైమాది పానకమనగా పంచతిక్త పానకమే అనియు వ్యాపార దృష్టిచే పేరు మార్చబడినది కానీ విద్యార్థులకు తెలియపరచరాని రహస్య మేమియు లేదనియు గోపాలాచార్యులు గారు చెప్పిరి. అందుపైని విద్యార్థులులు సమ్మె నిలిపి యథాప్రకారం కళాశాలలో చేరిరి.”

నేలవేము, నాభి తదితర జ్వర నాశక ద్రవ్యాలతో తయారైన ఔషధంగా దీని గురించి పెద్దలు చెప్తారు. అంటు వ్యాధులు ప్రబలే సమయంలో నేలవేము టీ కాచుకుని రోజూ ఒకటి లేక రెండు కప్పుల చొప్పున తాగుతుంటే అదే గొప్ప ఇమ్యూనిటీ బూస్టర్. వైరస్, బాక్టీరియాలను అంతం చేయగల శక్తివంతమైన ఔషధం అది.

తమిళనాడులో పెద్ద ఎత్తున జనసందోహం ఉండే చోట శిబిరాలు వేసుకుని ఈ నేలవేము కషాయాన్ని ఉచితంగా అందిస్తుంటారు. ప్రజలు బారులుతీరి నిలబడి దీన్ని తీసుకుంటూ ఉంటారు. అంటు వ్యాధులు ప్రబలకుండా కాపాడే ఔషధం అది!

మద్రాసుకు ఆహ్వానం

ప్లేగు వ్యాధి పైన తన ఆయుర్వేద అస్త్రాల ప్రయోగం విజయవంతం కావటంతో యువకుడూ ఆవేశపరుడూ అయిన గోపాలాచార్యుల మనసులో కొత్త ఆశలు చిగురించాయి. అల్లోపతి వైద్యాన్ని స్థిరపరచాలని బ్రిటిష్ ప్రభుత్వం చేస్తున్న కుట్రకు తలొగ్గక నిలిచిన మైసూరు రాజా వారిని ఆయన మనసారా అభినందించుకున్నారాయన.

1895: అనతి కాలంలోనే గోపాలా చార్యులవారి ప్రతిభ దేశం అంతా వ్యాపించింది. మనవాడు, మన ప్రావిన్సుకు చెందిన వాడనే భావన మద్రాస్ పురప్రముఖులకు కలిగింది. మద్రాసు రాష్ట్రంలోని ప్రముఖులు – సర్ ఎన్. సుబ్రహ్మణ్య అయ్యర్, కృష్ణస్వామి అయ్యర్, పి.వి. కృష్ణస్వామి శెట్టి ప్రభృతులు గోపాలచార్యులవారిని మద్రాసుకు ఆహ్వానించారు.

ఆయన మద్రాస్ చేరేనాటికి ఇప్పటిలా అక్కడ ఎలక్ట్రిక్ దీపాల్లేవు. కిరసనాయలు వేసిన తగరపు బుడ్లు వాడేవారు. తరువాత గ్యాస్ లైట్లు, పెట్రోమాక్స్ లైట్లు వగైరా వచ్చాయి. 1910కి గానీ మద్రాసులో విద్యుద్దీపాలు వెలగలేదు.

మనుషులు తమ ప్రయాణ అవసరాలకోసం గుర్రాలను కట్టే పెట్టెలు, మూడుచక్రాల వింతబళ్ళు వాడేవారు. అప్పటికి తన నివాస స్థానమైన బెంగళూరు పరిస్థితి కూడా ఇదే! అప్పటికి నాగరికత అంతకే పరిమితం.

ప్రజలకు మేలుచేసేది, దేశీయమైనది, తక్కువ ఖర్చుతో కూడినాయుర్వేద వైద్య విధానాన్ని కేవలం అసూయతో అంతం చేయాలని కంకణం కట్టుకున్నారు ఆంగ్లేయులు.

ఆంధ్ర ప్రజల్లో కూడా మనది అనగానే సహజమైన చిన్న చూపు. ఆధునిక వైద్య విధానం ఇంగ్లీషులో బోధించబడినంత మాత్రాన అదంతా బ్రిటిష్ వారి స్వంతం ఎంతమాత్రమూ కాదు.



అందులో ప్రపంచ దేశాల పరిశోధనలు ఎన్నో ఉన్నాయి. అల్లోపతి వైద్యాన్ని ఆంగ్లేయ వైద్యం అనుకోవటం బ్రిటిష్ వారి భ్రమ!

అందుకే, ప్లేగు కొంచెం వెనకపడ్డాక ఆయుర్వేద జీర్ణోద్ధరణ పైకి ఆయన మనసు మళ్లింది. ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెదకాలనే సూక్తి ననుసరించారాయన! ఏ మద్రాసులో ఆయుర్వేద అణచివేత ముమ్మరంగా ఉందో అక్కడే తన అవసరం కూడా ఉన్నదనే నిర్ణయానికొచ్చారాయన.

1895లో ఆయన మద్రాసుకు చేరారు. అప్పుడే ఆయనకు ఆయనకన్నా కొద్దిగా చిన్నవాడైన మరో యువకుడు, మేథావి కె యన్ కేసరి పరిచయం అయ్యారు. ఆయన ద్వారా కన్యకా పరమేశ్వరి దేవస్థానం & ఛారిటీస్ వారితో పరిచయం అయ్యింది.

ఆనాటి వైశ్యప్రముఖులు జాతీయోద్యమ స్ఫూర్తితో దేశీయతను పరిరక్షించాలనే లక్ష్యంతో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో అనేక ఆసుపత్రుల్ని నెలకొల్పారు. ఆయుర్వేద సేవలు చేయాలనేది వారి సంకల్పం.

ఆడబోయిన తీర్థం లాగా ఈ సంస్థ గోపాలాచార్యుల వారి లక్ష్యానికి తోడయ్యింది. సంస్థ లక్ష్యాలూ, ఆయన ఆదర్శాలూ ఒకటే కావటాన కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆయనకొక గొప్ప సాధనంగా మారింది.

వాళ్లు నెలకొల్పనున్న ఆసుపత్రిలో ప్రధాన వైద్యుడిగా గోపాలాచార్యులవారు నియమితులయ్యారు. మైసూరు అనుభవం తరువాత కథకి మద్రాసు మరో మలుపు

మద్రాసులో ఉచిత ఆయుర్వేద వైద్యశాల స్థాపన

ఒకపక్క నగరంలోని ప్రసిద్ధ ఆలొపతి ఆసుపత్రులకు విపరీత ప్రచారం ఇచ్చి ప్రజల్ని వ్యామోహపరుల్ని చేసిన బ్రిటిష్ ప్రభుత్వం ఆయుర్వేదం అశాస్త్రీయమైనదని నమ్మించే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఏ సత్యాన్ని ప్రస్తావించినా అది ప్రూవ్ కాలేదు అనటం ఓ ఎత్తుగడ. నూట పాతికేళ్ల తరువాత కూడా అదే మాట...ప్రూవ్ కాలేదు అనే! ప్రూవ్ చెయ్యరు. డిస్'ప్రూవూ చెయ్యరు. ఇది అశాస్త్రీయం అని నిరూపించరు. నిరూపణ కాలేదంటూ కాలం వెళ్ళబుచ్చుతుంటారు. స్వాతంత్ర్యానంతరం వచ్చిన భారతీయ ప్రభుత్వాలు కూడా ఈ నాటికీ ఈ ఎత్తుగడనే అనుసరిస్తున్నారు.

శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థాన ధర్మ ఆయుర్వేద వైద్యశాల 20వ శతాబ్దపు తొలి దశాబ్దాల్లో అద్భుంగా తన కార్యకలాపాలు కొనసాగించి ఆయుర్వేద చరిత్రను తిరగరాసింది.

పేరులోనే సూచించినట్లు, ఇది ధార్మిక దాతృత్వ ఆయుర్వేద డిస్పెన్సరీ. ఇది జార్జ్ టౌన్‌లోని కొత్వాల్ చావడీ ప్రాంతంలో ఉన్న శ్రీ కన్యాకా పరమేశ్వరి దేవస్థానంకి అనుబంధంగా నడిచింది.




ప్రసిద్ధ ఆయుర్వేద వైద్యుడు డా. కె.ఎన్. కేసరి తన బాల్యస్మృతుల్లో చెప్పిన ప్రకారం, ఈ ఆసుపత్రి ఆరంభానికి ఆలయ పూజారులు మరియు ఆర్య వైశ్య వాణిజ్యవేత్త పాలూరి రాజన్ చెట్టి ముందడుగు వేశారని!

మద్రాసులోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం మద్రాసు వైశ్యవాడ మధ్యలో ఈ ఉచిత ఆయుర్వేద ఆసుపత్రిని ప్రారంభించింది.

1908లో ఈ ఆసుపత్రి ప్రచురించిన ఒక ప్రకటన ప్రకారం, 1898 ఆగస్టు 14న ప్రారంభమై, మొదటి ఏడాదిలోనే 14,731 మంది రోగులకు సేవలు అందించింది. మొదటి దశాబ్దం ముగిసే సరికి ఈ సంఖ్య 69,000 మందికి పెరిగింది.

శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థాన ఉచిత హాస్పిటల్‌లో దీవి గోపాలచార్యులవారి పాత్ర గురించిన ఆధారాలకు ఆయన తన స్వంత ఫార్మసీ గురించిన డిస్క్రిప్టివ్ కేటలాగ్ కొంత సమాచారం మనకు అందిస్తుంది.


Awarded various Gold Medals and First Class Certificates for the Purity and Excellence of our Ayurvedic Medicines.

Descriptive Price List
of
Patent and other Sastraic Medicines
SCIENTIFICALLY PREPARED AT
The Madras Ayurvedic Laboratory
of
Ayurveda Marthanda Bhishangmani
Pandit D. Gopalacharlu, A.V.S.

WITH AN HISTORICAL SKETCH
of
AYURVEDA.

10TH EDITION.

The Madras Ayurvedic Laboratory,
Georgetown, MADRAS.

"నేను ఆయుర్వేద వైద్య కుటుంబంలో పుట్టాను. కానీ పెద్దవుతున్న కొద్దీ, ఆయుర్వేద శాస్త్రాన్ని పాశ్చాత్య వైద్య విధానాల లాంటి సంస్కృత విధానంలో ప్రజలకు అందించాలనుకునేవాడిని. అందుకే మైసూర్ మహారాజ్ సంస్కృత కళాశాలలో చేరి ఆయుర్వేద వైద్యాన్ని అభ్యసించాను. చదువు అయిపోయాక భారత్ అంతటా ప్రయాణించి ఇతర ప్రాంతాల్లోని ఆయుర్వేద పద్ధతులను అధ్యయనం చేసాను. తరువాత బెంగళూరులోని ఒక డిస్పెన్సరీలో పనిచేస్తూ వైద్యసూత్రాలను విజయవంతంగా అమలు చేశాను. 1901లో, మద్రాస్‌లోని శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థాన ఉచిత ఆసుపత్రిలో ప్రధాన చికిత్సకుడిగా చేరాను" అని వ్రాసుకున్నారు. ఆయన జీవిత చరిత్రకు ఇదే ఆధారం.

అసైన్మెంట్ పొందిన వెంటనే, ఆసుపత్రి విధానాల్లో ఆయన ప్రముఖ మార్పులను తీసుకువచ్చారు. ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందించారు. అనేక దీర్ఘ, తరుణ వ్యాధులకు నాణ్యమైన చికిత్సలు అందటంతో ఆసుపత్రికి అనతి కాలంలోనే ప్రసిద్ధి ఏర్పడింది.

జాతీయోద్యమం ఆయుర్వేద పునరుద్ధరణకు ఒక వేదిక కాగా, జాతీయోద్యమం పట్ల బ్రిటిష్ వ్యతిరేకత ఆయుర్వేద వ్యతిరేకతగా పరిణమించింది. దేశభక్తి ప్రేరేపితుడైన గోపాలాచార్యులవారికి జాతీయోద్యమ భావావేశపరుల అండ దొరికింది.



“ఆయుర్వేదాన్ని పాక్షికత లేకుండా లోతుగా అధ్యయనం చేస్తే, అది మానవాళికి అద్భుతమైన లాభం చేకూరుస్తుంది”

అంటూ, మైసూరు, బరోడా, కాశ్మీర్, జైపూర్ వంటి రాజులు, దేశభక్తులు, దాతలు ఆయుర్వేద పునరుజ్జీవనానికి చేయూతనివ్వాలని లేఖలు వ్రాశారు. “లేకపోతే ఈ మహత్తర వైద్యవ్యవస్థ ఆచరణలో నుంచి కనుమరుగయ్యే ప్రమాదం ఉంది” అన్నారు.

ఆయుర్వేద కళాశాల స్థాపన

నాలుగేళ్ళపాటు అహోరాత్రులు శ్రమించిన కారణంగా ఆసుపత్రి బాగా అభివృద్ధిలోకి వచ్చింది. ప్రతిష్టాత్మక ఆసుపత్రిగా రూపొందింది. కన్యకాపరమేశ్వరి ట్రస్టుబోర్డు సభ్యులను ప్రేరేపించి వారి చేత ఒక ఆయుర్వేద కళాశాలను ప్రారంభించేలా ఒప్పించారాయన.

గోపాలచార్యులవారు ఈ కళాశాల ప్రిన్సిపాలుగా, ఆసుపత్రి ముఖ్య వైద్యాధికారి, మెడికల్ సూపరింటెండెంట్‌గా బహుముఖీన పాత్రలు పోషించారు. ఈ కళాశాలలో ఉచిత విద్య, తక్కువ ఖర్చుతో వసతి కూడా కల్పించారు. వైశ్యుల వదాన్యతను ఆ రోజుల్లో ప్రతి ఒక్కరూ ప్రశంసించారు.

అంతకు పూర్వం ఆసుపత్రిలో ఇన్–పేషెంట్స్ విధానం ఉండేది కాదు. వచ్చిన రోగులను వచ్చినట్టు చూసి పంపించేసేవారు. గోపాలాచార్యులవారు ఆ పద్ధతిని మార్చి, ఆధునిక వైద్య విధానాలన్నింటినీ ప్రవేశపెట్టారు.

సాధారణ ఆసుపత్రులు మెడికల్ కాలేజీని అనుబంధంగా ఉంచిన విధంగా, ఆయన ఆసుపత్రి కమిటీతో కలిసి ఆయుర్వేద కాలేజీని ఏర్పాటు చేశారు. ఈ కాలేజీలో విద్యార్థులు దేశీయవైద్యశాస్త్రంలో శిక్షణ పొందారు. సంస్కృత గ్రంథాలను గోపాలచార్యులవారు, ఇతర ఉపాధ్యాయులు పాఠ్యాంశంగా బోధించేవారు.

అలోపతి వైద్య పద్ధతులలో శిక్షణ పొందిన డాక్టర్లు విద్యార్థులకు హైజీన్ వంటి ఆధునిక పాఠ్యాంశాల్ని కూడా బోధించారు. తద్వారా ఆధునిక వైద్యాన్ని కూడా సమాంతరంగా నేర్చుకో గలిగారు విద్యార్థులు. జ్ఞానం విషయంలో ఆయుర్వేద విద్యార్థులు ఒకింత ఎక్కువేనని నిరూపించాలనేదే గోపాలాచార్యులవారి తపన.

ఆయుర్వేద కోర్సు కోసం ప్రత్యేక పాఠ్యక్రమం రూపొందించారు. విద్యార్థులు 25 ఏళ్ల లోపు వయస్సు గలవారై ఉండాలని, సంస్కృత భాషలో కనీస పరిజ్ఞానం కలిగి ఉండాలనీ నియమం ఏర్పరచారు.

నెలకు 10 రూపాయలు దేవస్థానం నుంచి ఇవ్వగా, మరో 10 రూపాయల్ని గోపాలాచార్యులవారు తన జేబులోంచి ఇచ్చారు.



ఉన్నత విద్యార్థులకు నెలకు రూ. 15 ప్రత్యేక వేతనం ఇచ్చే విధానం కూడా ఏర్పాటైంది. ఈ నిధులు ఆయన స్వంతంగా నెలకొల్పిన మద్రాస్ ఆయుర్వేద ల్యాబొరేటరీ నుంచి వచ్చేవి.

జార్జ్ టౌన్, అచ్చుప్పన్ స్ట్రీట్‌లో నెలకొన్న ఈ ప్రయోగశాల మహామారి (ప్లేగ్) పైన పరిశోధనలకు ప్రసిద్ధి చెందింది. దేశం నలుమూలల నుండీ, విదేశాల నుండికూడా విద్యార్థులను ఆకర్షించిన అంశం ఈ లేబరేటరీయే!

ప్రతి సంవత్సరం డిసెంబర్‌లో పరీక్షలు జరిగేవి. వాటికి భారతదేశం నలుమూలల నుండి ప్రసిద్ధ ఆయుర్వేద, అలోపతి వైద్యులను పరీక్షాధికారులుగా ఆహ్వానించేవారు. అవసరమైనంత మేరకు ఆధునిక వైద్యం కూడా నేర్పించారు. తులనాత్మకంగా విద్యార్థి అధ్యయనం చేయటానికి ఇది ఎంతగానో తోడ్పడింది.

1905లో మొదటి బ్యాచి పట్టాలు పొందారు.

ఆయుర్వేదానికి ఆధునిక దృక్పథం

"పాత తాళపత్ర గ్రంథాలను చదవడమే సరిపోదు. విద్యార్థులు ఆధునిక శాస్త్రాల ఆధారంగా కూడా అభ్యసించాలి. రోగికి మేలు చేసే ఏదయినా అది ఉత్తమ ఔషధం; రోగిని నయం చేసే వాడే ఉత్తమ వైద్యుడు." అని తన విద్యార్థులకు ప్రబోధించారు గోపాలాచార్యులవారు.

పాశ్చాత్య వైద్యశాస్త్రం అందించిన పద్ధతులను స్వీకరించమని విద్యార్థులను ప్రోత్సహించారు.

కళాశాలలో తాళపత్రాలను ముద్రిత పుస్తకాలుగా మార్చి బోధించారు.

విద్యార్థులకు కూర్చోవటానికి బల్లలు, లెక్చర్ హాళ్లు ఏర్పాటు చేశారు.

మైసూరు, మద్రాసు ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలకు ఆర్థిక సహాయం చేశారు.

విద్యార్థులు ఒకే శాస్త్రంలో కాకుండా అనేక శాస్త్రాలలో పాండిత్యం పొందాలని, ఆధునిక శస్త్రచికిత్సా జ్ఞానం నేర్చుకోవాలని ప్రోత్సహించారు.

పాశ్చాత్య వైద్యుల్ని కళాశాలలో బోధించేందుకు ఆహ్వానించారు.

దీని వలన ఆయన విద్యార్థులు పూర్తి పండితులు, మంచి వైద్యులుగా తయారయ్యారు. శ్రీయుతులు నోరి రామశాస్త్రి, ఎం దొరస్వామి అయ్యంగార్, అగ్నిహోత్రం పార్థసారథి, వేటూరి శంకరశాస్త్రి, ఎన్ మాధవమీనన్, యేటూరి శ్రీనివాసాచార్యులు, మల్లాది రామమూర్తిశాస్త్రి, దీననాథమిశ్రా ఇలా ఎందరో ఆ కళాశాలలో చదివి ప్రముఖులుగా రాణించారు.



ఆయుర్వేదాశ్రమ స్థాపన

1897–1901 మధ్య గోపాలచార్యులవారు ఆయుర్వేద ఆశ్రమం స్థాపించారు.

పాశ్చాత్య శాస్త్రం, పాశ్చాత్య వైద్యం ప్రాధాన్యం పొందుతున్న కాలం అది! ప్రభుత్వం పని గట్టుకుని ఆయుర్వేదాన్ని కించపరిచేలా వ్యవహరించేది బజారు వైద్యం అని పేరుపెట్టి ఈసడించేవాళ్లు. అలోపతి వైద్యులు రోగి ముందే ఆయుర్వేదాన్ని కించ పరుస్తూ మాట్లాడేవాళ్లు. శాస్త్రీయవైద్యం కాదంటూ గేలి చేసే వాళ్లు. తమ మూలాల్ని, తమ పునాదుల్ని మరిచిపోయిన మనవాళ్లు కూడా దొరల భాషకే వంత పాడేవాళ్లు.

ఆ రోజుల్లో ప్రజలు సంస్కృతంలో చదవటానికి సంకోచించేవారు. ఈ భాషా అవరోధాన్ని అధిగమించడానికి, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొంతమంది ఆయుర్వేద పండితులు ఆయుర్వేద గ్రంథాలను తెలుగు పద్యాల రూపంలో సులభంగా అర్థమయ్యేలా రచించారు. వాటిలో రాయసం పేరయ్య "నవనాథ సిద్ధసారం", "వైద్యచింతామణి", "శరభరాజీయం", "నేత్రదర్పణం" ముఖ్యమైనవి. అయితే ఆ సమయంలో బృహత్రయీ వంటి గ్రంథాలను తెలుగులో బోధించడం చాలా కష్టమైన పని. కానీ గోపాలచార్లు ఆ సవాలను స్వీకరించి, తెలుగులోనే బృహత్రయిని బోధించారు.

ఆయన స్వాతంత్ర్య సమరయోధులతో కలసి ప్రజల్లో ఆయుర్వేదంపై అవగాహన పెంచారు. "ఆయుర్వేదాశ్రమ గ్రంథమాల" పేరుతో అనేక విలువైన హస్తప్రతులను సేకరించి, వాటిని తెలుగులో అనువదించి ప్రచురించారు. ఈ శ్రేణిలో సుమారు 20 ఆయుర్వేద గ్రంథాలు వెలువరించారు. వాటిలో మాధవనిదానం, ఆయుర్వేద పరిభాష, పథ్యాపథ్యము, రసప్రదీపిక, భేషజ కల్పము, అగస్త్య వైద్యము, ఆయుర్వేద శల్య తంత్రము, వస్తికర్మము, అర్కప్రకాశము వంటి గ్రంథాలు ముఖ్యమైనవి.

తన కాలంలో ఆయుర్వేద ప్రాచీన గ్రంథాలకు తెలుగు అనువాదాలు, వ్యాఖ్యానాలు సమకూర్చిన అరుదైన పండితుడిగా గోపాలచాయులవారు నిలిచారు.

1919లో ఆయన "ధన్వంతరి" అనే పత్రిక ప్రారంభించారు. ఇందులో ఆయుర్వేద పరిశోధనా ఫలితాలు ప్రచురించబడేవి. తరువాత ఈ పత్రికను ఆచంట లక్ష్మీపతి స్వీకరించి, ఆయుర్వేద వైద్యులలో విశేష ఖ్యాతి పొందేలా తీర్చిదిద్దారు.

1914లో తమిళనాడు మెడికల్ రిజిస్ట్రేషన్ చట్టం అమలులోకి వచ్చింది. ఈ సందర్భంలో దివి గోపాలచార్లు సంప్రదాయ వైద్య విధానాలు కూడా ప్రభుత్వ నియంత్రణలోకి రావాలని గట్టిగా వాదించారు.

ఆయన అభిప్రాయం ప్రకారం, ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరికీ వైద్యాన్ని ఆచరించే హక్కు ఉండకూడదు. ఆయన కార్యనిర్వాహక మండలి సభ్యులు, న్యాయమూర్తులు,

ప్రముఖులను కలసి, "ఆయుర్వేదాన్ని ప్రోత్సహించడం ప్రజలూ – ప్రభుత్వమూ కలసి చేయాల్సిన కర్తవ్యమే" అని స్పష్టం చేశారు.

"వైద్యంలో నైపుణ్యం ఉన్నంత మాత్రాన సరిపోదు. వైద్య జ్ఞానం, అనుభవాన్ని ప్రజల మేలుకోసం, దేశ పురోగతికోసం ఉపయోగించాలి. అదే వారి రాజకీయ అభివృద్ధికి కూడా ఒక పథం అవుతుంది."

ఔషధ తయారీ ఆధునీకరణ

చెన్నపురి జార్జ్ టౌన్‌లో 'మద్రాసు ఆయుర్వేద లాబొరేటరీ'ని స్థాపించారు.

భారీగా ఔషధాలు తయారు చేసి దేశవ్యాప్తంగా సరఫరా చేశారు. ఇవ్వాళ పెద్ద పెద్ద ఆయుర్వేద ఔషధ తయారీదార్లకు ఆయన మార్గదర్శకుడు.

56 ప్రత్యేక ఔషధాలు, వందలాది ప్రాచీన ఆయుర్వేద ఔషధాలను తయారు చేశారు. వివిధ వ్యాధుల వారీగా మందుల జాబితా, వాటి ప్రయోగాలు, మోతాదు, పథ్యాపథ్యాలు, వాటి ధరల పట్టిక కూడా ప్రచురించారు.





1908లో ప్రచురించిన డిస్క్రిప్టివ్ కేటలాగులో ఔషధ నిర్మాణానికి వారు అనుసరించిన విధానాన్ని వివరించాయి.

వారి ఆసుపత్రిలో మందుల నిల్వ గదిని ఎక్కువ మంది సందర్శకులు చూసారు. అందులో అన్ని ఔషధాలు వ్యాధులవారిగా వర్గీకరించి, దూరానికి కనిపించేలా లేబుల్స్ వేసి ఉంచారు.

ప్రజల ఫిర్యాదుల కోసం ఒక పెట్టెను ఉంచారు. అందులో ఒక ఫిర్యాదు దారుడు "రోజుకు 200 మందికీ పైగా రోగులను చూసే ఆసుపత్రికి గది చిన్నది." అని వ్రాసి చీటీ వేశాడు. ప్రజలు ఆసుపత్రి అభివృద్ధిని మనసారా కోరుకున్నారనటానికి ఇది సాక్ష్యం.

ఆ ఉచిత ఆసుపత్రిలో ఓపీ విభాగం ఎలా కళకళలాడుతూ ఉండేదో ప్రత్యక్షసాక్షిగా అవటపల్లి నారాయణరావుగారు విశాలాంధ్రము పుస్తకంలో ఇలా వ్రాశారు:

"ఆచారప్పన్ వీధి : ఆయుర్వేదాశ్రమం. కొంచెం పొట్టి, కాస్త స్థూలమైన ఆకారం, కాళ్లు దిగిన పెద్ద పట్టుకోటు, జరీపోగులు

వేసిన మస్లిన్ తలగుడ్డ, బ్రహ్మతేజస్సును ప్రతిఫలిస్తున్న ముఖం. శాంతమైన చూపులు, ఋషి సంప్రదాయాన్ని సూచించే పెద్ద గెడ్డం యిలాటి లక్షణాలున్న మహాపురుషులొకరు బల్లముందు కూరుచుండి ఏవో మందులకు సంబంధించిన చీట్లను ఆడువారికి, మగవారికి, పిల్లలకూ వ్రాసి యిస్తూ, అందరి క్షేమాన్నీ విచారిస్తూ ధైర్యపు మాటలు చెప్పుతూ, చిరునవ్వుతో పంపి వేస్తూవున్నారు.

వచ్చేవారు వస్తున్నారు, వెళ్లేవారు వెళ్లుతున్నారు. తెంపులేదు. ఆ బల్లకు కొంచెం అవతలో ఏవో ఓషధులు రాసులు రాసులుగా పడివున్నాయి. రవంత వెనక్కు పోతే పెద్ద పెద్ద యిత్తడి కాగులలో ఏవో ద్రావకాలు కాగుతున్నాయి. స్త్రీలు పంక్తులు పంక్తులుగా కూరుచుండి కల్వాలమీద మందులను నూరుతున్నారు. ఏ ప్రక్క చూచినా వ్యాధి నిర్మూలనానికీ, ఆరోగ్యాభివృద్ధికీ జరుగుతున్న కోలాహలమే!

సుమారు పాతిక సంవత్సరాలు ఆంధ్రదేశానికే కాదు, భారతవర్షం అంతకున్నూ ఒక నూతన సందేశాన్ని యిచ్చి, ఒక నూతన వుత్సాహాన్ని కల్పించి, జీర్ణమైన ఆయుర్వేదాన్ని వుద్ధరించడానికై అవతరించి, మహాయజ్ఞాన్ని ప్రారంభించిన యీ ఆశ్రమవాసులే ఆయుర్వేద మార్తాండ, వైద్యరత్న, పండిత గోపాలాచార్యులవారు."

1904లో మద్రాస్ హైకోర్ట్ జడ్జ్, గవర్నర్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడుగా కూడా తరువాతి కాలంలో పనిచేసిన వకీలు శ్రీ వి. కృష్ణస్వామి అయ్యర్ "ఆయుర్వేద ఆసుపత్రి అనే సంకల్పం ప్రోత్సహనీయమైనది, ఇంకా ఇలాంటి మరిన్ని ఆసుపత్రులు రావాలి." అంటూ ప్రశంసించారు. ఈ కృష్ణస్వామి అయ్యర్ గారే 1915లో మహాత్ముడు తొలిసారి చెన్నై వచ్చినప్పుడు ఆయనకు ఆతిథ్యం ఇచ్చారు. దీవి గోపాలాచార్యులవారిని ప్రభావితం చేసిన ప్రముఖుల్లో కృష్ణస్వామి అయ్యర్ ఒకరు.



ఔషధ నిర్మాతగా...

పూణేలోని ఆయుర్వేద మహాసభలో ప్రసంగిస్తూ గోపాలాచార్యులవారు ఇలా అన్నారు:

"ఆయుర్వేద ఔషధాల తయారీకై కావాల్సిన పదార్థాలన్నీ మన దేశంలోనే లభ్యమవుతాయి. వాటి కోసం విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. మహాయుద్ధమో, ప్లేగో, ఫ్లూనో వచ్చినా మనకెంత కావాలంటే అంత పొందగలం."

గోపాలాచార్యులవారు శాస్త్రసిద్ధమైన, శ్రేష్ఠమైన ఔషధాలను ప్రత్యేకంగా తమ ఆయుర్వేదాశ్రమంలో తయారుచేయించి, దేశీయమహాజనసభకు అనుబంధంగా దేశీయ వస్తు ప్రదర్శనలకు పంపిస్తూ, దేశీయ నాయకుల దృష్టిని ఆకర్షించారు.

ఆయనకు పరిచయం లేని, ఆయన్ని అభినందించని జాతీయ నాయకుడు ఆనాడు లేరంటే ఆశ్చర్యం లేదు.

ఆనాటి జాతీయోద్యమ నాయక త్రయం లాల్, బాల్, పాల్ ముగ్గురితోనూ ఆయనకు ఎంతో సాన్నిహిత్యం ఉండేది. వారివలన తాను జాతీయతా స్ఫూర్తిని పొందారు. వారిలో ఆయన దేశీయ వైద్యాన్ని ఉద్ధరించటమే దేశభక్తి అనే భావనను బాగా నూరి రంగరించి పోశారు. ఆ విధంగా జాతీయోద్యమాన్ని దేశియ వైద్య ఉద్యమంగా మార్చగలిగారు గోపాలాచార్యులవారు.

మరాఠా యోధుడు బాలగంగాధర తిలక్ పూనేలో ప్లేగు మహమ్మారి వచ్చినప్పుడు దాని నివారణకు గోపాలాచార్యులవారి సహకారాన్ని తీసుకున్నారు. ఆయుర్వేదం శక్తిని స్వయంగా దగ్గరగా పరిశీలించి నిర్ధారించుకున్నారాయన! పంజాబ్ కేసరి లాలా లజపతి రాయ్ గోపాలాచార్యులవారిని ఎంతగా గౌరవించేవారంటే, లాహోరులో ఆయుర్వేద ఆసుపత్రికి గోపాలాచార్యులవారిని తీసుకువెళ్లి ఆయనతో శంకుస్థాపన చేయించారు.

అవుటపల్లి నారాయణారావుగారు ఇలా వ్రాశారు:

"ఆనరబుల్ మహామహోపాధ్యాయ గంగాధరశాస్త్రి, ఆనరబుల్ రావుబహద్దూరు విద్యావినోది ఆనందాచార్యులు, డాక్టరు సర్ బాలచంద్రకృష్ణ, మహామహోపాధ్యాయ కవిరాజ ద్వారకానాథసేన్ లాంటి మహామహుల అభినందనలను పొందుతూ, తమ ఔషధాలకు ప్రతిష్ఠను గోపాలాచార్యులవారు సంపాదించుకొన్నారు. కాని, వీటి నన్నిటిని వొక యెత్తుగాను, వారి ప్లేగు ఔషధాలను యింకొక యెత్తుగాను గణింపవలసివుంది. దేశం నాలుగు ప్రక్కలా ప్లేగు బయలుదేరి ప్రజను తినివేస్తున్న సమయంలో వారి హైమాది పానకం. శతధౌత ఘృతం యెందరి ప్రాణాలనో కాపాడి, చాలా ఉపకారం చేసినాయి. ఇందుకై వారిని శ్రీశ్రీ గద్వాల మహారాణీవారు సువర్ణపతకంతో సన్మానించారు."



ఆయన ఎన్నో పరిశోధిత గ్రంథాలు వ్రాశారు. సుశ్రుత సంహిత, మాధవనిదానాది గ్రంథాలకు ఆధునిక దృష్టితో వ్యాఖ్యానాలు వ్రాసి జీర్ణ గ్రంథాలను వుద్ధరించారు. తమ పుస్తకభాండాగారంలో పరిశోధకులకు వసతులు కల్పించారు

రాజకీయంగా ప్రభావవంతులైన వారితో అనుబంధాలు కలిగి, దేశవ్యాప్తంగా ఆయుర్వేద వర్గాలను ఏకం చేసి అడ్డంకులను తొలగించడానికి కృషి చేశారు. సంపాదనలో ఒక భాగాన్ని నిర్బంధంగా ఆయుర్వేద అభివృద్ధికి సమర్పించారు. ఆయన జీవితం మనకు ఒక బోధన

"ధర్మం చేయాలంటే మరణం ప్రతి క్షణం మనల్ని లాక్కెళ్తున్నట్లుగా త్వరగా చేయాలి" అని చెప్పిన మాటలే ఆయన ఆచరణలో చూపారు.

కాస (దగ్గు), మధుమేహం, ఊపిరితిత్తులు, రక్తహీనత, పేగు సమస్యలు, జుట్టు నష్టము, కడుపు సమస్యలు, నరాల బలహీనత వంటి అనేక వ్యాధుల కోసం ఔషధాలు సిద్ధం చేశారు.

"తమ ఆశ్రమంలో ఔషధాలను తయారుచేయడానికిన్ని, తమ ధర్మ వైద్యశాలలో రోగులను పరీక్షించి ఔషధాలు నిర్ణయించడానికిన్ని, తమ ప్రయత్నాల నన్నిటిని కేంద్రీకరించే నిమిత్తమై శ్రీ బొబ్బిలి మహారాజవారు అలాగే, డాక్టరు సర్ సుబ్రహ్మణ్య అయ్యరు, సర్ పి. త్యాగరాయశెట్టి, దివాన్ బహద్దూరు రాజరత్నం మొదలియారు మొదలయిన ప్రముఖుల యాజమాన్యం క్రింద ఆయుర్వేద ప్రచారిణీ సభను స్థాపించారు. తమ ఉద్యమ వ్యాప్తికై ఒక ముద్రాలయాన్ని, ఒక వార్తాపత్రికను నెలకొల్పారు.

ధన్వంతరి ఉత్సవాలలో మద్రాసులో సభలు చేయించి ఆయుర్వేద ప్రచారం చేయిస్తూ వచ్చారు.

స్వాతంత్ర్య సమరంలో పోరాట యోధుడిగా

గోపాలాచార్యుల వారికి దేశీయతా భావాన్ని దేశీయ వైద్యం పట్ల అభిమానాన్ని, దేశీయ వైద్యాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లాలనే సంకల్పానికి అప్పుడే ఆరంభదశలో ఉన్నప్పటికీ జాతీయోద్యమం ఎంతగానో ప్రేరణ నిచ్చింది! అప్పటికి ఇంకా వందేమాతర ఉద్యమం, బెంగాల్ విభజన లాంటి సంఘటనలు జరగలేదు. తరువాతి కాలంలో ప్రసిద్ధి చెందిన నాయకులెవ్వరూ అప్పటికి ఇంకా ఉద్యమంలోకి రాలేదు.

1885 నుండి 1905 వరకూ జరిగిన స్వాతంత్రోద్యమం అంతా మితవాద యుగం. ప్రార్థన, విజ్ఞప్తి, నిరసన విధానాలు మాత్రమే అవలంభించే వారు. దానికే బ్రిటిష్ ప్రభుత్వం ఈ జాతీయవాదులపైన గుర్రుగా ఉండేది.

ఎ.ఓ హ్యూమ్, గోపాలకృష్ణగోఖలే, సురేంద్రనాథ్ బెనర్జీ, దాదాభాయ్ నౌరోజీ, ఫిరోజ్ షా మెహతా లాంటి నాయకులు ఉండేవారు. వీళ్లు తమ రచనల ద్వారా, ఉపన్యాసాల ద్వారా జాతీయతాభావాన్ని పెంపొందించేవారు.



మద్రాసుకు సంబంధించినంతవరకూ, 1852లో గాజుల లక్ష్మీనరసు శెట్టి (మద్రాస్ నేటివ్ అసోసియేషన్, క్రిసెంట్ పత్రిక), 1884లో పి. రంగయ్యనాయుడు (మద్రాస్ మహాజనసభ), 1885లో పార్థసారథి నాయుడు (ఆంధ్రప్రకాశిక వారపత్రిక), 1891లో నాగపూర్ కాంగ్రెస్‌కి అధ్యక్షత వహించిన తెలుగు వాడు పి ఆనందాచార్యులు, భారత జాతీయ కాంగ్రెస్ కు కార్యదర్శిగా పనిచేసిన న్యాపతి సుబ్బారావు ప్రభృతులు ఆనాడు గోపాలాచార్యుల వారిని ప్రభావితం చేసిన స్వాతంత్ర్య సమర యోధులు.

ఆ రోజుల్లో గోపాలాచార్యులవారు లేనిదే రాజా రామ్మోహన రాయికి నగరంలో వార్షికోత్సవమే జరిగేది కాదని, బీచి దగ్గర జరిగే సమావేశాల్లో ఆయన ప్రముఖంగా కనిపించేవారనీ సమకాలికుల వ్రాతల్లో కనిపిస్తుంది.

కాంగ్రెస్ సభలు ఎక్కడ జరిగినా సభాస్థలిలో ఆయన ఒక స్టాలు అద్దెకు తీసుకుని తన ఆయుర్వేదాశ్రమం పక్షాన ఉచిత వైద్యశిబిరం నిర్వహించేవారు. ఎక్కడ చూసిన ఆయుర్వేదం పేరు వినబడాలనేదే ఆయన లక్ష్యం.

పనప్పాకం అనంతాచార్లుగారితో పరిచయం

పనప్పాకం అనంతాచార్యులుగారు 1885లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ స్థాపించడం కోసం బొంబాయిలో సమావేశం అయిన 72 మంది దేశీయ ప్రముఖులలో ఒకరు. ఆ తరువాత ఆరేళ్ళకు ఆ సంస్థకు అధ్యక్షుడైన తొలి దకిణాది నాయకుడు కూడా ఆయనే!

శ్రీ అనంతాచార్యులు మద్రాసులో స్థిరపడిన తెలుగువాడు. తమిళ, ఆంధ్ర ప్రజల మధ్య సాంఘిక, సాంస్కృతిక సేతువుగా పని చేశారు.

"అనంతాచార్యులు అనే ఆయన తెలుగు పేరు తమిళుల ఉచ్చారణలో "ఆనందాచార్యులుగా మారిపోయింది. చిత్తూరు జిల్లా కట్టమంచి గ్రామంలో జన్మించారాయన. చిన్నతనంలో ఆయన చాలా ఇబ్బందులు పడ్డారు. పట్టభద్రుడు కాకముందే కొంత కాలం మద్రాసులోని పచ్చియప్ప పాఠశాలలో టీచర్‌గా పని చేశారు. 1860 లో ఆయన న్యాయశాస్త్ర పట్టభదులు అయ్యారు.

అచిరకాలంలోనే న్యాయవాదిగా ఎదిగారు. మద్రాసు నేటివ్ అసోసియేషన్ కార్యదర్శిగా, ట్రిప్లికేన్ లిటరరీ అసోసియేషన్ అధ్యక్షుడుగా, "మద్రాసు మహాజన సభ" సభ్యుడుగా నానా ముఖాలుగా జాతీయోద్యమ ఆరంభ వికాసాలకు ప్రేరకు డయ్యారు. వీరరాఘవాచారియర్, రంగయ్య నాయుడు, హిందూ సంపాదకులు సుబ్రహ్మణ్య అయ్యర్ ప్రభృతులు ఆయన సన్నిహితులు.

సురేంద్రనాథ్ బెనర్జీతో చేయి కలిపి నాటి ఐ,సి ఎస్. పరీ కలు ఇంగ్లండ్‌లోనే కాక, ఇండియాలో కూడా జరుపుతూ ఉండాలని ఆందోళన చేశారు. 1885 నుంచి 1904 వరకూ మద్రాసు తరపున ఆయన 'సుప్రీమ్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో సభ్యులుగా పనిచేశారు.



నిర్మొహమాటంగా ప్రభుత్వ విధానాలను విమర్శించే వారు. ప్రజల హక్కుల్ని నిర్భయంగా సమర్థించేవారు.

గోపాలాచార్యులవారు ఈ పనప్పాకం వారికి అత్యంత సన్నిహితులయ్యారు. ఒకవిధంగా ఆయన మార్గదర్శకుడుగా, ప్రేరకుడుగా యువకుడైన గోపాలాచార్యులవారి ఆలోచనలను అమితంగా ప్రభావితం చేశారు.

తెలుగువాడైన అనంతాచార్యులవారు సంతకం చేసేప్పుడు ఇంగ్లీషులో వ్రాసినా 'అనంతాచార్లు' అనే తెలుగుదనం ఉట్టిపడేలా వ్రాసేవారు. అనంతాచార్యులతో సాన్నిహిత్యాన్ని చాటుకుంటూ గోపాలాచార్యులవారు కూడా అప్పటి నుండీ 'గోపాలాచార్లు' అని వ్రాసుకోవటం మొదలు పెట్టారు.

వేటూరి ప్రభాకరశాస్త్రిగారిని వెంటబెట్టుకుని తీసుకువెళ్లి అనంతాచార్యుల వారికి పరిచయం చేసింది గోపాలాచార్యుల వారే నని వేటూరి వారు పేర్కొన్నట్టు మణిమంజరి పత్రికలో ఉంది.

ప్రతీ యేడూ గోపాలాచార్యులవారి మేడమీద నవరాత్రులలో గానసభలు జరిగేవని వాటికి అనంతాచార్యులవారు అధ్యక్షత వహించేవారని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు వ్రాసినట్టు కూడా మణిమంజరి పేర్కొంది!

బాల్యమిత్రుడు నాగేశ్వరరావు పంతులుగారు

బందరులో చదువుకునే నాటి నుండీ ఆంధ్రపత్రిక వ్యవస్థాపకులు దేశోద్ధారక, విశ్వదాతగ అప్రసిద్ధులైన కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారితో గోపాలాచార్యులవారికి స్నేహం ఉండేది. వీరి ఔషధాల ప్రకటనలు ఆంధ్రపత్రికలో విడవకుండా వచ్చేవి. నాగేశ్వరరావు పంతులుగారు గోపాలాచార్యులవారితో అనేక వ్యాశాలు వ్రాయించి ఆంధ్రపత్రిక ప్రత్యేక సంచికలలో ప్రచురించే వారు. జాతీయోద్యమ స్ఫూర్తి ఆ బాల్యమిత్రులిద్దరికీ సమానమే!

బందరులో ఏర్పడిన చిన్ననాటి చెలిమి మద్రాసులో కూడా కొనసాగింది. ఆంధ్రపత్రిక ఆఫీసుకు దగ్గరలోనే గోపాలాచార్యులవారి ఆయుర్వేదాశ్రమం ఉండేది.

డా. డి వి ఏ ఆచార్య వ్రాసిన పండిత గోపాలాచార్య గ్రంథంలో గోపాలాచార్యులవారి మరణానికి కొద్ది రోజులముందు

బాల్యమిత్రుడు కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు గారితో పండిట్ జీ తీయించుకున్న ఫోటో ప్రచురించి, వారిద్దరి మధ్య జరిగిన సంభాషణను ఇలా పేర్కొన్నారు:

"1920 సంవత్సరం వచ్చింది. ఒకరోజు పండిట్‌జీ అస్వస్థతతో పడకకుర్చీలో కూర్చున్నారు. ఇంతలో పండిట్ జీ బాల్యస్నేహితులైన కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు విచ్చేశారు. కొంత సంభాషణ జరిగిన తరువాత పంతులుగారు తానొక



తొందరపనిమీద నగరాంత్రం పోవాలని పలికారు. పండిట్ జీ గద్గదంగా అన్నారు: నాగేశ్వరరావు! వెళ్లవద్దు, నీవు తిరిగ వచ్చేసరికి నేను కనబడను” అని!



పంతులుగారు కంటతడిపెట్టి పండిట్ జీని ఓదార్చారు. వారు గోపాలాచార్యులవారి మాటలను సర్వసామాన్యమైన అస్వస్థుని దీనాలాపములుగా వ్యాఖ్యానించుకొన్నారు. నగరాంతరం వెళ్లడం తప్పనిసరి అయ్యింది. పండిట్ జీ మాటల్లోని అంతరార్థం పంతులుగారికి బోధపడలేదు.

రౌద్రినామ సంవత్సరం భాద్రపద బహుళ పాడ్యమీ బుధవారం 29-8-1920 పండిట్ జీ నిర్యాణ దినం

ఆచార్య తిరుమల రామచంద్ర ఇలా వ్రాశారు

తెలుగు వారి ప్రాతఃస్మరణీయులు ఆచార్య తిరుమల రామచంద్ర తన ‘హంపీ నుండి హరప్పా దాకా’ గ్రంథంలో గోపాలాచార్యులవారు శంకుస్థాపన చేసిన లాహోరు ఆయుర్వేద కళాశాల గురించి ఇలా వ్రాశారు.

“గోపాలాచార్యుల వారి శిష్యులకు ఆయన ఆయుర్వేదాన్ని ఉద్ధరించడానికి ‘అవతరించిన ధన్వంతరే! నిజానికి ఇది చాలవరకు సహేతుకమే. ఆయన ఉద్యమించక పోయి ఉంటే ఆయుర్వేదం బ్రిటిష్‌వారి కాలంలో అంతరించిపోయేదే.

శిష్యులు ఆయనను ఎంతగా గౌరవించేవారో తలచుకుంటేనే ఆశ్చర్యం కలుగుతుంది.

నేను 1939లో లాహోరు వెళ్లాను. ఒకనాడు ఊరు చూస్తూ దయానంద్ ఆయుర్వేదిక్ కాలేజ్ అనే నామఫలకం చూచి ఆగాను. ఆవరణ ద్వారం మీద “ఫౌండేషన్ స్టోన్ లెయిడ్ బై వైద్యరత్న పండిట్ డి. గోపాలాచార్య” అని చెక్కిన చలువరాతి బండ ఉంది. దానిని చూస్తూ ఒక తెలుగువాడు, నేను చిన్ననాడు దర్శించిన తెలుగువాడు ఇంత దూరాన ఉన్న ఆయుర్వేద కళాశాల భవనానికి శంకుస్థాపన చేయడమా – అని ఆశ్చర్యానందాలతో అల్లాగే నిలుచున్నాను.

భవనం లోపలి నుంచి ఒక సమున్నత శరీరుడయిన స్ఫురద్రూపి పంజాబీ తలపాగాతో పైజామా అచ్‌కన్‌లతో వచ్చి, నన్ను చూచి “క్యాదేఖ్ రహే హై?” అని ప్రశ్నించారు. “ఈ శంకుస్థాపన చేసిన మహనీయుడు నా ప్రాంతం వాడు. ఆనందంతో ఆయన పవిత్ర నామధేయం చూస్తున్నాను” అన్నాను వినయంతో.

“ఓహ్! అయితే తమరు మా గురువుగారి ప్రాంతంవారు. లోపలికి దయచేయండి”



అంటూ తలపాగా తీసి నా ముందు పెట్టి, వంగి నమస్కరించారు. ఆయన మద్రాసు ఆయుర్వేద కళాశాల చివరి బృందంవారు. పేరు డాక్టర్ మెహతా. వేటూరి శంకర శాస్త్రిగారి సహాధ్యాయులు. అంతటిది వాళ్ల గురుభక్తి!

ఆంధ్ర విద్యానిధి ప్రకటన

1917 మార్చి 12 ఆంధ్రపత్రికలో ఒక వాణిజ్య ప్రకటన వచ్చింది:

"మన పురోభివృద్ధికి విద్యావ్యాపనం ముఖ్యమైన సాధనము. సకల దానములందును విద్యాదానముత్తమమైన దానము. ఈ యుత్తమ దానమును చేయుటకు సంవత్సరాది పండుగ సమీపించు చున్నది. ఆ పుణ్యదినమునందు దేశబాంధవులందఱును ఆంధ్ర విద్యానిధికి చందాల నిచ్చుటకునకును చందాలు పోగుచేయుటకును ప్రార్థితులు. సంవత్సరమునకొక రూపాయి నిచ్చెడివారు సభ్యులుగా జేరగలరు, కాని, యథాశక్తిని ఆంధ్రులందరు ఈ విద్యానిధికి సహాయము చేసిన వారి పేరులు ఆంధ్రపత్రికాముఖమున ప్రచిరింపబడును." ఇదీ ఆ ప్రకటన.

బి యన్ శర్మ అధ్యక్షులు, సహకార్యదర్శులుగా పండిత డి గోపాలాచార్యులు, వే. రామదాసు, కాశీనాథుని నాగేశ్వరరావు ఈ ప్రకటనను విడుదల చేశారు.

తన వైద్యకళాశాలలో చదువుకునే విద్యార్థులకు ఉచితంగా విద్య చెప్పటమే కాకుండా అదనంగా తన లేబరేటరీ ఆదాయంలో ప్రతి విద్యార్థికి 10 రూపాయల చొప్పున ఉపకారవేతనంగా ఇచ్చి చదువు చెప్పిన ఆ విద్యాదాత విద్య నేర్చుకోవటానికి విద్యార్థికి ఆర్థిక సామాజిక అంశాలు అడ్డు రాకూడదనే భావన ఈ పత్రికా ప్రకటనలో కనిపిస్తుంది.

ఆ విశాల వక్షస్థలానికి పతకాలే అలంకారం!

మైసూరు ప్రభుత్వ ఆసుపత్రి వారిచే క్రియాపథంలో యోగ్యతాపత్రం పొందారు.

1904లో బొంబాయి వస్తు ప్రదర్శనలో హైమాదిపానకము ఇంకా మరికొన్ని ఔషధాలను ప్రదర్శించి స్వర్ణపతకాన్ని పొందారు.

ప్లేగు మందులకోసం శ్రీ గద్వాల సంస్థానం వారిచే ఒక పసిడిపతకం, పారితోషికం పొందారు.

1905–బనారసు ప్రదర్శనంలో బంగారు పతకం, మొదటి తరగతి యోగ్యతాపత్రం పొందారు.

1906– కలకత్తా నగరంలో ఫస్ట్ క్లాస్ సర్టిఫికేట్

1907– నాసిక్ లో ఆయుర్వేద మార్తాండ బిరుదు సత్కారం.

1907– కలకత్తాలో భిషఙ్మణి బిరుదు సత్కారం

1909– కేరళ ఆయుర్వేద సమాజం 7వ సదస్సుకు కొల్లంగోడులో అధ్యక్షత


1913– 5వ జార్జి సార్వభౌముడు కాలంలో భారత ఆంగ్లేయ ప్రభుత్వం వైశ్రాయిగారితో వైద్యరత్న బిరుదు సత్కారం అందించింది.

1913– బొంబాయిలో జరిగిన నిఖిల భారత వర్షీయాయుర్వేద మహాసమ్మేళనానికి అధ్యక్షత,

1917– హరిద్వార్ లో ఋషికుల బ్రహ్మచర్యాశ్రయంలో జరిగిన ఆయుర్వేద వైద్య మహాసమ్మేళనానికి, బెజవాడలో జరిగిన ప్రధమాయుర్వేద వైద్యసమ్మేళనానికి అధ్యక్షత,

1918– తెనాలి గుంటూరు మండల ప్రాధమికాయుర్వేద యూనాని వైద్యసమ్మేళనానికి అధ్యక్షత,

1918–లాహోరులో నిఖిల భారత వర్షీయాయుర్వేద నవమ వైద్య మహాసమ్మేళనానికి అధ్యక్షత,


SANAD

M. R. Ry. Pandit Deevi Gopala Charlu Avergal, of Madras.

I hereby confer upon you the title of Vaidyaratna as a personal distinction.

Viceroy and Governor General of India

5వ జార్జి చక్రవర్తి కాలంలో బ్రిటిష్ రాణికి విజయవంతంగా చికిత్స చేసినందుకు, భారత వైస్రాయి గౌరవపూర్వకంగా ఇచ్చిన వైద్య రత్న బిరుదుతో కూడిన సనద్.

1919 తిరువనంతపురం ద్వితీయ ద్రావిడాయుర్వేద వైద్య సమ్మేళనానికి అగ్రాసనాధిపత్యం అలంకరించారు.

1920 వైఖానస మహాజనసభ పండితసత్కారం చేసింది.

కృష్ణామండల అర్చకమహాసభకు ఆయన అధ్యక్షత వహించారు.

అఖిలభారత ఆయుర్వేద విద్యాపీఠం అధ్యక్షుడు

మైసూరు ప్రెసిడెన్సీ, పంజాబ్ డి.ఏ.వి. కాలేజ్, అలహాబాద్ ఆయుర్వేద మహామండలి, ఢిల్లీ యునానీ టిబ్బు కళాశాల గ్రంథాలయం, ఆయుర్వేద విద్యత్ పరీక్ష, శ్రీ సయాజీ ఆయుర్వేద విద్యాపీఠం వంటి సంస్థలకు సభ్యత్వం.

వారు వ్రాసిన రసప్రదీపిక వైద్య గ్రంథం ముఖచిత్రం పైన గ్రంథరచయితగా తన పేరుకు ముందు విశేషణాలను ఇలా పేర్కొన్నారాయన:



"చెన్నపురి ఆయుర్వేద కాలేజ్ ప్రిన్సిపాలును, చెన్నపురి ధర్మ ఆయుర్వేద వైద్యశాలా ప్రధాన చికిత్సకులును, ఆయుర్వేద విద్యాపీఠ సభానాయకులును, పరీక్షకులును మరియయు మైనూరు దొరతనము వారియొక్కయు, పంజాబు డి. ఏ. వి. కాలేజి వారి యొక్కయు, ఆయుర్వేద విద్వత్పరీక్షకులును, డిల్లీ ఆయుర్వేద యూనాని తిబి కాలేజియొక్క పఠన గ్రంథ నియమన సభా సభ్యులును, ఆయుర్వేద విద్వత్పరీక్షకులును, శ్రీ సయాజీ ఆయుర్వేద విద్యాపీఠ సభ్యులును, చరక సుశ్రుత మాధవనిదానాది గ్రంథములకు వ్యాఖ్యాన కర్తలును, కేరళ ఆయుర్వేద సమాజ సప్తమ మహాసమ్మేళనాధ్యక్షులును, బొంబాయి అఖిల భారత వర్షీయ ఆయుర్వేద మహాసమ్మేళనాధ్యక్షులును, భరత ఖండమందలి దేశీయ మహాసభానుబంధంగా జరిగిన మహావస్తు ప్రదర్శనమునను ననేక స్వర్ణపతకులను బొందినట్టి, శ్రీమత్పంచమ జార్జి సార్వభౌమునిచే ప్రదత్తమగు వైద్యరత్న బిరుదావళీ విరాజమానులగు

ఆయుర్వేద మార్తాండ, భిషఙ్మణి పండిత డి గోపాలాచార్యులు ఎ.వి.ఎస్"

నిజానికి ఆయన విజయాలు ఇంకా ఇన్ని ఉన్నాయి. వాటినన్నింటినీ పేర్కొంటే పేజీ నిండి పోతుంది. అయితే, అవి రాసుకోవటం వలన ఆయనకు అదనంగా వచ్చే భుజకీర్తులు ఏమీ ఉండకపోవచ్చు. కానీ, కొత్తగా ఈ పుస్తకాన్ని తెరిచిన ఒక పాఠకుడికి దాని విలువ తెలియాలంటే ఈ మాత్రం పరిచయం చేసుకోకతప్పదు.

ఆయుర్వేద పునరుద్ధరణ కమిటీ

1919లో ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ప్రభుత్వం దేశీయ వైద్య విధానం గురించి సూచనలు చేయవలసిందిగా డాబబ కోమను నాయర్ అధ్యక్షతన ఒక కమీటీనీ వేసింది.

ఆ కమిటీ కొన్ని మందుల్ని గవర్నమెంటు ఆసుపత్రుల్లో ఇచ్చి చూసి ఔషధాలు బాగానే పనిచేస్తున్నాయి గానీ, ఈ శాస్త్రానికి శాస్త్రబద్ధత లేదని నివేదిక ఇచ్చింది. దాంతో దేశాభిమానులైన శాసనసభ్యులు అలజడి చేశారు.

అప్పుడు రాష్ట్రప్రభుత్వం 1921లో సర్ ఉస్మాన్ గారి అధ్యక్షతన కెప్టెన్ జి. శ్రీనివాసమూర్తిగారు కార్యదర్శిగా ఆచంట లక్ష్మీపతి గారు సభ్యుడుగా మరొక కమిటీని నియమించారు.

ఈ ముగ్గురి కమిటీ దేశం అంతా తిరిగింది. వైద్య సంస్థల్ని ఫార్మశీల్ని ఆసుపత్రుల్ని సందర్శించింది. ప్రజల అభిప్రాయాలు సేకరించింది. దేశీయ వైద్యుల నుండి కైఫీయత్తులు తీసుకుంది. ప్రాంతాల వారిగా అధ్యయనం చేసి, దేశీయ వైద్యాన్ని ప్రోత్సహిస్తే గ్రామీణ పేదలకు ఎక్కువ ఉపయోగకరంగా ఉంటుందని, ఆయుర్వేద వైద్యులకు రిజిస్ట్రేషన్ ఇస్తే నాణ్యమైన వైద్యం అందే వీలౌతుందని, దేశీయ వైద్యకళాశాలను ప్రభుత్వమే స్థాపించి అందులో సిద్ధ యునాని కూడా శాఖలుగా ఏర్పాటు చేయాలని, శాస్త్రీయమైన రీతిలో వైద్య



విద్య బోధించాలని, శస్త్ర చికిత్సలు, ప్రసూతి వైద్యం లాంటివి ఆంగ్లవైద్య విధానాన్నే అనుసరించేలా తర్ఫీదు ఇవ్వాలని, ఉస్మాన్ కమిటీ తన నివేదికలో సూచించింది. అలా కమిటీని ఆచంట లక్ష్మీపతిగారు ప్రభావితం చేశారంటే ఇంకా బావుంటుంది.

ఈ విధంగా ప్రభుత్వ వ్యతిరేకతను తగ్గించినా ప్రజానుకూలతను కూడా సముపార్జించుకోవటానికి ప్రజల్లోకి ఆయుర్వేదాన్ని తీసుకువెళ్లే ఉద్యమాన్ని కొనసాగించాలని ఆయుర్వేద ఉద్యమకారులు భావించారు.,

గోపాలాచార్యులవారు సాధించిన ఆయుర్వేద ప్రగతి

జాతీయోద్యమ ఫలితంగాను, ఆనాటి కాంగ్రెస్ సంస్థ కార్యకలాపాల వలననూ దేశీయ వైద్య ఉద్ధరణ ఉద్యమం కూడా సమాంతరంగా నడిచింది. జాతీయ నాయకులు ఈ విషయానిక్కూడా ప్రాధాన్యత నివ్వటం మొదలు పెట్టారు. ముఖ్యంగా తిలక్ ఆయుర్వేద ప్రగతి కోసం జాతీయ స్థాయిలో నిలబడిన వ్యక్తి. అప్పటికింకా భారతదేశ రాజకీయ ముఖచిత్రం పైన మహాత్మా గాంధీ ముద్ర పడలేదు. ఆయన సౌతాఫ్రికాలోనే ఉన్నారు.

ఆనాటి కాంగ్రెస్ నాయకులతో వ్యక్తిగత సాన్నిహిత్యం ఏర్పడటంతో పండిత గోపాలాచార్యులవారు దేశీ వైద్య పరిరక్షణ డిమాండుని గట్టిగా దేశం అంతా వినిపించేలా చేశారు.

తెలుగు నేలకు పరిమితమై పరిశీలిస్తే దేశీయ సంచలనానికి ప్రబోధితులై అఖండ కృషి సల్పిన అంధ్ర ఆయుర్వేద ప్రముఖులు

అనేకులున్నారు. అన్నింటికన్నా ప్రముఖంగా చెప్పుకోదగిన విజయం దేశీయ వైద్య విధానానికి ప్రభుత్వతోడ్పాటు లభించటం.

ఆయుర్వేదం అంటే కంటకింపుగా ఉన్న బ్రిటిష్ వాళ్లకు కళ్ళు తెరిపించి ప్లేగు వ్యాధిని అదుపు చేయటంలో ఆయుర్వేదమే మిన్నగా పనిచేసిందని గోపాలాచార్యులవారు నిరూపించటం, వైశ్రాయి, బ్రిటన్ మహారాజు సహా అందరూ అంగీకరించటంతో బ్రిటిష్ అధికార్లు తల ఒగ్గక తప్పలేదు.

బజారు వైద్యులని హేళన చేసిన వారే వైద్యరత్న అని సనదులిచ్చి దణ్ణం పెట్టక తప్పలేదు. పాశ్చాత్య పద్ధతిలో ఆయుర్వేద జెషధాలకు మోతాదులను సిద్ధాంతీకరించారు.

1919లో శ్రీ ధన్వంతరి పక్షపత్రికను స్థాపించారు

నిజానికి 1892లోనే ఆయుర్వేద ప్రచారోద్యమం మొదలయ్యింది పువ్వాడ వారు అనేక ప్రాచీన గ్రంథాల్ని అచ్చు వేశారు. ఎర్రావారు వస్తుగుణదీపికను తెచ్చారు. విజయనగరం రాజావారు వైదిక శబ్దసింధు, సింహారావు గజపతి నహాయోగానందామృత కల్పవల్లి, కార్వేటి నగరం చరక సూత్రస్థానం ఆంధ్రీకరణ, ఇలాంటివన్నీ వైద్యసేవాదృక్పథంతోనే వచ్చాయి.



నూజివీడు జమీదారుగారి ప్రోత్సాహంతో చివుకుల సత్యనారాయణ శాస్త్రిగారు రసరత్నసముచ్ఛయం,ఆంధ్రా ఆయుర్వేద ఫార్మశీవారి చక్రదత్త, వేటూరి వారి వస్తుగుణదీపిక జనసామాన్యంలోకి బాగా వెళ్లాయి. ఆయుర్వేద వైద్యులు కానివారు కూడా వస్తుగుణదీపికని ఉత్సాహంగా కొని పదిల పరచుకున్నారు. శ్రీపాదవారి చరకసంహిత, ముక్కామల వెంకటశాస్త్రిగారి భావప్రకాశ, త్రిదోష సర్వస్వం, వల్లూరి వారి కౌమారభృత్య తంత్రం, ప్రతివాది భయంకర కృష్ణమాచార్యులవారి శారీరం లాంటి రచనలు తెలుగులో కొల్లలుగా వెలువడ్డాయి. వావిళ్ళవారు లోలంబరాజీయం, వృక్షాయుర్వేదం లాంటి అనేక గ్రంథాలకు వ్యాఖ్యానం వ్రాయించి తక్కువ ధరలకే అందించారు.

ఆంధ్ర వైద్యసమ్మేళన ప్రత్యేక సంచికలు, ధన్వంతరిసుధ, కుమార మిత్ర, ఆయుర్వేద కళ లాంటి పత్రికలు వచ్చాయి.

దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి అమృతాంజనం ఆ రోజున దేశంలోనే అత్యధికంగా అమ్ముడు పోయిన ఔషధం. కాగా, తరువాతి స్థానం కేసరి కుటీరం వారి 'లోధ్ర' ఔషధాన్ని చెప్పుకోవాలి. 'లోధ్ర' ఔషధం స్త్రీల గర్భాశయ పోషకంగా గొప్పగా పనిచేసిందా రోజుల్లో! అనేక స్త్రీలవ్యాధులకు నివారకం కూడా!

నోరి రామశాస్త్రిగారి క్షీరవర్ధని కూడా బాగా ప్రసిద్ధి పొందింది. బరంపురంలో బి కె గుప్తాగారు గుప్తా ఆయుర్వేద నిలయం పెట్టి శాండో లేహ్యం పేరుతో బలవర్ధక ఔషధాన్ని ప్రచారంలోకి తెచ్చారు.

కోరంగిలో పొన్నాడవారు, చింతలూరులో ద్విభాష్యం వారు, బెజవాడలో శ్రీపాద వారు, నోరివారు, ఏలూరులో శ్రీకృష్ణా ఆయుర్వేద ఫార్మశీ, భీమవరంలో సంజీవని, ముక్త్యాలలో ఆర్షరసాయన శాల ప్రసిద్ధిపొందిన ఆయుర్వేద ఫార్మశీలు ఆనాడు. జమ్మివారి లివర్ క్యూర్ పిల్లల లివర్ వ్యాధులకు పెట్టింది పేరుగా ఉండేది. అప్పారావుగారి ఔషధం టాన్సిల్సు తగ్గించటానికి పేరుపడ్డది. రమణక్కపేట అమృతభల్లాతక అవలేహ్యం చాలా పేర్గాంచింది.

ఇదంతా దీవి గోపాలాచార్యులవారి చలవే! ఆయన ఆ స్థాయిలో పూనుకుని ఉండకపోతే ఆంగ్లేయులు ఆయుర్వేదాన్ని నల్లిని నలిపినట్టు నలిపేసేవారు. ఆ ప్రమాదం రాకుండా కాపాడిన ఆ మహనీయునికి జాతి ఎంతగానో ఋణపడిఉంది.

ఆయన మరణించినప్పుడు సంతాపకంగా ఆంధ్రపత్రికలో బి. డి. ప్రసాదరావు అనే కవి వ్రాసిన ఈ పద్యం స్మరణీయం:

"ఆయుర్వేదము నుద్ధరించుటకునై యాంధ్ర ప్రపంచంబునం
దేయూవిర్భవమొంది జీర్ణదశలో నే మాలనోయున్న
యాయుర్వేదదము నుద్ధరించి నిజశిష్య శ్రేణి విఖ్యాతిమై
యీ యాంధ్రోర్విని మించఁజేసిన సుతుండేగెన్ దివిన్ జూడగన్"



పానగల్లు రాజా కృషి

గోపాలాచార్యులవారి ప్రేరణతో రాజకీయంగా ఎక్కువ స్పందించిన ఇద్దరు ప్రముఖుల్ని తప్పక స్మరించుకోవాలి ఒకరు పానగల్లు రాజా పానుగంటి రామారాయణింగారు, రెండవవారు శ్రీ ఎ ఎస్ కృష్ణారావు. ఈ ఇద్దరూ శాసనసభల్లో దేశీయ వైద్యం గురించి పదేపదే మాట్లాడి ప్రభుత్వాన్ని ఆయుర్వేద వ్యతిరేకత లోంచి బైటకు తేవటంలో ముఖ్యపాత్ర పోషించారు.

1901లో గోపాలాచార్యులవారు మద్రాసులో స్థాపించిన ఆయుర్వేద కళాశాలను ఆయన అనంతరం 1927 దాకా ఆచంట లక్ష్మీపతిగారు నిర్వహించగా పానగల్లు రాజా ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రభుత్వకళాశాలగా నడపటం ప్రారంభించారు.

ఇదే దారిలో బెజవాడలో నోరి రామశాస్త్రిగారు, రామమోహన ధర్మవైద్యశాల సంఘం వారు, గుంటూరు రంగాచార్యులవారు ఆయుర్వేద కళాశాలలు ప్రారంభించారు. పానగల్లు రాజా వారిని కూడా ప్రోత్సహించారు



పానగల్లురాజా విగ్రహం (వికిపీడియా సౌజన్యం)

పానగల్ రాజాగా ప్రసిద్ధి చెందిన సర్ పానుగంటి రామారాయణింగారు (జూలై 9, 1866 – డిసెంబరు 16, 1928), శ్రీకాళహస్తి జమిందారు, జస్టిస్ పార్టీ నాయకుడు, జూలై 11, 1921 నుండి డిసెంబరు 3, 1926 వరకు ఉమ్మడి మద్రాసు రాష్ట్రం ముఖ్యమంత్రిగా పనిచేశారు. చెన్నైలో పానగల్లు పార్కు, అందులో ఆయన విగ్రహాన్ని ఇప్పటికీ చూడవచ్చు.

పానగల్లురాజా పదారణాల తెలుగు బిడ్డ. శ్రీకాళహస్తిలో జన్మించాడు. మద్రాసులో విద్యాభ్యాసం పూర్తి చేసుకొని సంస్కృతం, న్యాయశాస్త్రం, తత్త్వము, ద్రవిడ భాషలలో పట్టాలు పొందాడు. ఆ తరువాత రాజకీయాలలో ప్రవేశించాడు. జస్టిస్ పార్టీ వ్యవస్థాపక సభ్యులలో ఒకడు. 1925 నుండి 1928 వరకు ఆ పార్టీ అధ్యక్షుడిగా కూడా ఉన్నాడు.

జస్టిస్ పార్టీ అంటే బ్రిటిష్ అనుకూలురైన జమీందార్ల పార్టీ. కానీ, పానగల్లు రాజా స్వయంగా సంస్కృత పండితుడు కావటాన ఆయుర్వేదం పట్ల ఆయనకు సదభిప్రాయం ఉంది. అది ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నకాలంలో ఆయుర్వేదానికి ఎంతో ఉపకరించింది.



వైద్య చరిత్రకారుడిగా పరిశోధనలు

భారతదేశంలో ఒకప్పుడు చరక విద్యాపీఠం, సుశ్రుతవిద్యాపీఠం, అగస్త్య విద్యాపీఠం లాంటివి బలంగా పనిచేసేవని వాటి వివరాలను వెల్లడి చేశారు గోపాలాచార్యులవారు.

దక్షిణభారత ఆయుర్వేద ప్రచారసభలో ఈ విషయాలను ప్రస్తావిస్తూ ప్రసంగించారు.

శ్రీలంకలో అరుదైన ఔషధ మొక్కలు సంధానకరణి, సవర్ణ్యకరణి, సంజీవకరణి ఉన్నాయని వాటి గురించి వెల్లడి చేశారు.

అలాగే కేరళ అష్టవైద్య సంప్రదాయం, కర్ణాటక వైద్యులు ఉగ్రాదిత్య, మంగరాజ, అభినవచంద్ర, సింహదత్త, చంద్రరాజరామచంద్ర, దేవేంద్రముని, నృసింహాభట్ట రచించిన పూజ్యపాదీయం, ఖగేంద్ర మణిదర్పణం, మదనతిలక, అశ్వవైద్యం వంటి గ్రంథాలను వెలుగులోకి తెచ్చారు. సారార్థ సంగ్రహం, భేషజ మంజూష, సరసంక్షేపక, భేషజ కల్ప, యోగశతక, సరస్వతి నిఘంటువు, యోరత్నాకర గ్రంథాలు దక్షిణ భారతదేశంలో ప్రముఖంగా ఉండేవని వాటి గురించి ప్రస్తావించారు.

అనేక రాతి శాసనాలు, రాగి పలకల శాసనాలను పరిశీలించి, ప్రాచీన ఆసుపత్రుల ఉనికిని నిరూపించారు.

చింగలపట్టు జిల్లా తిరుముక్కూడల శాసనం (1067 AD, చేరచోళ మహారాజు)

కాకతి రుద్రమ మాల్కాపురం శాసనం: ప్రసూతి, సాధారణ ఆసుపత్రుల స్థాపన, పాలనాధికారుల వైద్య పరిరక్షణ.

అక్కలపూడి శాసనం: కొరుకొండ సింఘయనాయకుడిచే ప్రసిద్ధ వైద్యుడు పరహితాచార్యునికి గ్రామదానం.

కాలవచేరు శాసనం: పాము కాట్ల నివారణలో నిపుణులైన పరహిత వైద్య కుటుంబం చేసిన సేవల వివరణ.

వెంకటేశ్వర ఆలయానికి అనుబంధ కళాశాలకు చెందిన 15 మంచాల ఆసుపత్రి వివరాలు.

నందలూరు శాసనం: ప్లేగు మహమ్మారి కారణంగా గ్రామ జనాభా మార్పును లిఖించిన వైద్య చరిత్రను లోకానికి చాటారు.

కె యన్ కేసరి వేరు కుంపటి

ఆయుర్వేద వైద్యరంగం, పత్రికారంగం, దానధర్మాలలో ఒక విశిష్ట ముద్ర వేసిన పేరు – కేసరి. 'కేసరి కుటీరం' అనే ప్రసిద్ధ ఆయుర్వేద ఔషధ నిర్మాణ సంస్థ అధినేత.



ఆయన అసలు పేరు కోట నరసింహం. అయితే ఆయుర్వేద ఔషధాల తయారీ వ్యాపారాన్ని "కేసరి కుటీరం" పేరుతో ప్రారంభించినప్పటి నుండి ఆయన్ని అందరూ "కేసరి" అనే పిలిచారు. అలా ఆయన కె యన్ కేసరి అయ్యారు. ఆయన ప్రధానంగా వైద్యులు, వ్యాపార దక్షులు, పత్రికా రచయిత, సంపాదకులు మరియు గొప్ప వితరణశీలి.

1899లో చెన్నపట్నంలో "కేసరికుటీరం" పేరుతో కొన్ని చారుత్రక పరిస్థితుల్లో ఒక ఆయుర్వేద ఔషధాల తయారీ సంస్థను ప్రారంభించారు. ముఖ్యంగా స్త్రీల వ్యాధుల కోసం లోధ్ర ఔషధాలు తయారు చేశారు. ఒక్క లోధ్ర ఔషధంతోనే ఆయన గొప్ప ధనికులయ్యారంటే ఆశ్చర్యం కాదు. కాశీనాథుని నాగేశ్వరరావుపంతులుగారి అమృతాంజనంతో పోటీపడి అమ్మకాలు జరిపింది లోధ్ర.

కేసరి గారి ఆలోచనల్లో ఎంతటి దాతృత్వం వున్నదో అంతటి వ్యాపార దృక్పథం ఉండేది. ఆయన గుర్రాల వ్యాపారం కూడా చేసేవారట! అయితే తన సంపదను కేసరిగారు మహిళాభ్యుదయం, జాతీయోద్యమాల కోసం ఎక్కువగా వినియోగించారు.

"గృహలక్ష్మి" మాసపత్రికను ప్రారంభించి, ప్రతీ ఏడాది ప్రసిద్ధ స్త్రీమూర్తులను స్వర్ణకంకణాలతో సన్మానించేవారు. స్థానాపతి రుక్మిణమ్మ, ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ లాంటి ప్రసిద్ధ రచయిత్రులు ఈ కంకణ్ సత్కారం పొందిన వారిలో ఉన్నారు.

తన చిన్ననాటి విశేషాలను "ముచ్చట్లు" పేరుతో గృహలక్ష్మి, ఆంధ్రజ్యోతి మాసపత్రికల్లో ధారావాహికగా ప్రచురించి 1953లో పుస్తక రూపంలో తెచ్చారు. దాని రెండో ముద్రణ సుమారు అర్ధశతాబ్దం తర్వాత కేసరి కుటీరం శతజయంతి సందర్భంలో విడుదల అయ్యింది. ఆయన ఆనాటి నాటి తెలుగు వారి జీవితాన్ని అందులో వివరంగా చిత్రించగలిగారు.

కేసరి గారికి ఆయుర్వేదం మీద మంచి పట్టు ఉంది. దాన్ని సొమ్ము చెయ్యాలనే ఆలోచనలు కూడా మెండుగా ఉన్నాయి. మంచి సమయం కోసం ఎదురు చూస్తుండగా అప్పుడే మద్రాసులో అడుగిడిన దీవి గోపాలాచార్యులవారు ఎదురయ్యారు.

గోపాలాచార్యులవారు 1872లోనూ, కేసరి గారు 1875లోనూ జన్మించారు. మూడేళ్లు గోపాలాచార్యులవారే పెద్ద. కానీ, గోపాలాచార్యుల వారికన్నా ముందే పొట్ట చేతపట్టుకుని మద్రాసు వచ్చి ఉపాధి వెదుక్కొంటున్నారు కేసరి. గోపాలాచార్యులవారు అప్పటికే ప్రసిద్ధి పొంది, ప్లేగు నివారకుడిగా ముద్ర పడిన వ్యక్తి.

కన్యకాపరమేశ్వరి దేవస్థాన వైశ్యప్రముఖులకు గోపాలాచార్యులవారిని పరిచయం చేసింది కేసరి గారే! ఆ తరువాత గోపాలాచార్యులవారు వారిచేత ఆయుర్వేద కళాశాల పెట్టించే దాకా చేసిన కృషి అంతా మనకు తెలిసిందే!



గోపాలాచార్యులవారికి సహాయకుడిగా కేసరి పనిచేశారు. తన వైద్య పర్జ్ఞానాన్ని అనుభవాన్ని ఆ నీడలో తనను ఎంతగానో మెరుగుపరచు కున్నారాయన.

ప్లేగు వ్యాధి బెంగళూరు, పూనే లాంటి నగరాల్లో మాటిమాటికీ తిరగబెడ్తుండటంతో గోపాలాచార్యులవారి మద్రాస్ ఆయుర్వేద ల్యాబొరేటరీలో (1908) 'ఆయుర్వేద మరణ రోగ (ప్లేగ్) మిశ్రమం' అనే ఔషధాన్ని కొత్తగా తయారు చేశారు.

తెలుగు ప్రాంతాల్లోనే కాకుండా, ప్లేగు పీడిత ప్రాంతాల్లో, దేశం నలుమూలలా అమ్మకాలను విస్తృత పరచాలనేది కేసరిగారి ఆకాంక్ష. ప్రజలు మహమ్మారి బారిన పడి కష్టాల్లో ఉన్నప్పుడు వాణిజ్యపరంగా ఆలోచించటం, డబ్బు చేసుకోవాలని చూడటం సబబు కాదనేది గోపాలాచార్యులవారి తలంపు. బహుశా ఆ ఇద్దరు ప్రాణమిత్రులకూ మార్కెటింగ్ స్ట్రాటజీ విషయంలోనే పొసగక పోయి ఉండాలి. స్నేహపూర్వకంగా విడిపోతేనే మంచిదనే అభిప్రాయానికి ఇద్దరూ వచ్చారు.

గోపాలాచార్యులవారు తన దారిలో తన పని చేసుకుపోసాగారు. కె యన్ కేస్రి గారు మాత్రం స్వంతంగా 'కేసరి కుటీరం' పేరుతో స్వంత ఔషధ నిర్మాణ సంస్థను ప్రారంభించారు.

నారాయణ మొదలి వీధిలో "కేసరికుటీరం ఆయుర్వేద ఔషధశాల" ప్రారంభమై వ్యాపారం అభివృద్ధి చెందింది. ఆయన మిత్రుల సహాయం, వ్యాపార దక్షతతో వ్యవహారంలో విజయం సాధించారు. వ్యాపారం కోసం ప్రచారం చేయడంలో ఆ రోజుల్లో ఆయనకు ఆయనే సాటి. అది ప్రత్యక్షంగానూ, పరోక్షంగ అకూడా ఆయుర్వేదాభివృద్ధికి ఎంతగానో తోడ్పడింది. గోపాలాచార్యులవారు నాగేశ్వరరావు పంతులుగారి ఆంధ్రపత్రికలోనూ, కేసరి గారు మద్రాసులోని ఎ.సి. పార్థసారథినాయుడు గారి పత్రికలోనూ ప్రకటనలు ఇచ్చేవారు.

స్త్రీ వ్యాధులకు తయారు చేసిన 'లోధ్ర' ఔషధం కేసరిగారి విశేష సంపాదనకు కారణమయ్యింది. తన సంపాదనలోంచి కేసరి గారు కొంత మొత్తాన్ని కేటాయించి స్త్రీల అభ్యుదయం కోసం 1928లో "గృహలక్ష్మి" మాసపత్రికను ప్రారంభించారు. దాన్ని ముద్రించటం కోసం "లోధ్ర ముద్రాలయం" ప్రారంభించారు.

ప్రచురించబడింది. ఈ పత్రికను అనేక కాలం ఆంధ్ర శేషగిరి రావుగారు సంపాదకులు నిర్వర్తించారు.

20వశతాబ్దపు తొలిపాదంలో ఆయుర్వేద ప్రశస్తికి కారకులుగ అముగ్గురు పేర్లను తప్పక తలచుకుంటారు ఎవరైనా... మొదటి వారు పండిత దీవి గోపాలాచార్యులు, రెండవ వారు డాబబ ఆచంట లక్ష్మీపతి, మూడవ వారు డాబబ కె. యన్. కేసరి.



ఆచంట లక్ష్మీపతిగారు ఓ ఆయుర్వేద దీక్షితుడు

20వ శతాబ్దపు మొదటి సగం దక్షిణ భారత వైద్యచరిత్రలో ఆచంట లక్ష్మీపతి (1880–1966) మరియు దీవి గోపాలాచార్యులు (1872–1947) అనే రెండు పేర్లు విడదీయరానివి. ఒకరు పాశ్చాత్య వైద్య విద్యలో పట్టభద్రుడై, తరువాత ఆయుర్వేద పునరుద్ధరణ కర్తగా మారిన ఆధునిక సంస్కర్త; మరొకరు సంస్కృత పాండిత్యం, తాళపత్రగ్రంథ సంపాదన, వ్యాఖ్యాన సంప్రదాయాల ద్వారా ఆయుర్వేదానికి చరిత్రాత్మక లోతును ఇచ్చిన పండితుడు. వీరిద్దరి గురు–శిష్య సంబంధం కేవలం విద్యాపరమైనది కాదు, సాంప్రదాయ ఆధునిక సమన్వయానికి ప్రతీక.

ఆచంట లక్ష్మీపతి జీవితం ఒక వైద్యుని వ్యక్తిగత విజయగాథ మాత్రమే కాదు, ఆధునిక భారత వైద్యపునరుజ్జీవన యాత్రలో ఒక కీలక అధ్యాయం. ఆయన్ని అర్థం చేసుకోవాలంటే దీవి గోపాలాచార్యుల వలయం, వారి శ్రద్ధ, వారి సహవాసం గుర్తు చేసుకోవాలి.

గోపాలాచార్యులవారి ఆకస్మిక మరణం తరువాత వారి స్థానాన్ని భర్తీ చేయటానికి ప్రయత్నించిన మరో సౌజన్యమూర్తి ఆచంట లక్ష్మీపతిగారు. స్వతహాగా అల్లోపతి వైద్యుడై ఉండి ఆయుర్వేద ప్రసస్తిని తెలుసుకుని గోపాలాచార్యుల వారిని ఆశ్రయించి ఆయుర్వేదం నేర్చుకుని దాని ఉద్ధరణకు సమాయత్తమయ్యారు.

1918లో మెడికల్ రిజిస్ట్రేషన్ చట్టాన్ని తెచ్చింది బ్రిటిష్ ప్రభుత్వం. ఈ రిజిస్ట్రేషన్ పరిధిలోకి ఆయుర్వేద వైద్యుల్ని రాకుండా కట్టడి చేసింది ఈ విధానానికి నిరసనగా తన పేరుని మెడికల్ లిస్టులోంచి తనే తొలగించుకున్నారు.

గోపాలాచార్యులవారే తన అంతేవాసిగా లక్ష్మీపతిగారిని ఎంపిక చేసి తన బాధ్యతల్ని వహించవలసిందని చెప్పారు. కళాశాల ఫార్మశీ, గ్రంథ ప్రచురణలు కొనసాగించారు. ఆయుర్వేద ఉద్యమానికి నాయకత్వం వహించి నడిపించారు.

ఆచంట లక్ష్మీపతి గారి కాలానికి మహాత్మాగాంధీ కాంగ్రెస్ నాయక్అత్వ బాధ్యతలు తీసుకోవటంతో దేశీయ వైద్య విధానం, శాకాహార ప్రాధాన్యం, శరీర పరిశుభ్రత, ఆయుర్వేదంలో చెప్పిన ఆచార వ్యవహారాల ప్రచారాన్ని ఆయన కూడా కొనసాగించారు. లక్ష్మీపతిగారిని సబర్మతి ఆశ్రమానికి పిలిపించుకుని దేశీయ వైద్య విధాన పునరుద్ధరణ గురించిన సమాచారాన్ని తెలుసుకున్నారు. జాతీయోద్యమంలో భాగంగా ఆయుర్వేద ప్రగతిని కూడా ప్రచారం చేయాల్సిన అవశ్యకతను ఆయన గుర్తించారు.

గాంధీజీ రాక తర్వాత జాతీయోద్యమంలో ఆంధ్రులు చురుకైన పాత్ర పోషించారు. హిందీ ప్రచారం, ఖద్దరు ప్రచారాలతో పాటూ దేశీయ వైద్య ప్రచారం కూడా ఆంధ్రులు ఇష్టంగా చేశారు. ఊరూరా ఆయుర్వేద సమ్మేళనాలు జరిగాయి. ప్రజల్లో ఆయుర్వేదం పట్ల నమ్మకం గౌరవం పెంపొందాయి.



కాంగ్రెస్ నాయకత్వంలో స్థానిక ప్రభుత్వాలు ఏర్పడినప్పుడు అనేక మున్సిపల్ డిస్పెన్సరీల్లో ఆయుర్వేద వైద్యుల్నే నియమించి దేశీయత పట్ల తమ అనురక్తిని చాటుకున్నారు.

1917లో గోపాలాచార్యులవారు బెజవాడలో ఆంధ్ర రాష్ట్రీయ ఆయుర్వేద వైద్య సమ్మేళనం ప్రారంభించారు. తరువాత జరిగిన సభలన్నీ లక్ష్మీపతిగారి నేతృత్వంలో జరిగాయి. నోరి రామశాస్త్రిగారు, ప్రతివాద భయంకర కృష్ణమాచార్యులవారు, కవిరాజ కృష్ణమోహన్ ప్రభృతులు లక్ష్మీపతిగారికి తోడుగా నిలిచారు.

1933లో బికనీరులో జరిగిన సమ్మేళనానికి లక్ష్మీపతిగారు అధ్యక్షత వహించారు.

లక్ష్మీపతి గారు పశ్చిమ గోదావరి జిల్లా మాదవవరం గ్రామంలో జన్మించారు. తండ్రి రామయ్య, తల్లి జనకమ్మ సాదాసీదా కుటుంబానికి చెందినవారు. ఆయన తాత సుబ్బరాయుడు సంస్కృత పాండిత్యంలో ప్రసిద్ధి చెందారు. ఆ సంప్రదాయం వల్లనే ఆయన మనసులో శాస్త్రవిజ్ఞానం పట్ల ఆసక్తి పెరిగింది. చిన్ననాటి నుంచే "వ్యవసాయాన్నీ, వైద్యాన్నీ కలిపి నేర్చుకోవాలి" అన్న సమగ్ర దృష్టి పెంచుకున్నారు.

ఆయనకు పాఠశాల దశలో గురువుగా ఉన్నవారు కందుకూరి వీరేశలింగం పంతులుగారు. సామాజిక సంస్కరణల ఆవేశం, విద్యా విస్తరణలో ఆచరించిన ధర్మబోధ, లక్ష్మీపతిగారిపై లోతైన ముద్ర వేశాయి. ఎఫ్.ఏ. పూర్తిచేసిన తర్వాత, కొంతకాలం దావులూరి ఉమామహేశ్వరరావు అనే అధికారి వద్ద క్లర్క్‌గా పనిచేశారు. ఆయన మద్రాసుకు బదిలీ అవగానే, లక్ష్మీపతిగారు అక్కడికి వెళ్లి చదువు కొనసాగించారు. 1904లో బి.ఏ. పూర్తి చేసి, స్కాలర్‌షిప్ సహాయంతో ఎం.బి.బి.ఎస్.(1909) పట్టా సాధించారు. తెలుగు వారిలో యంబీబియస్ పట్టాపొందిన రెండవ వ్యక్తి ఆయనే!

అలోపతి వైద్యంలో శిక్షణ పొందినా, ఆయన మనసు భారతీయ సంప్రదాయ వైద్యపద్ధతి ఆయుర్వేదం వైపు మళ్లింది. దీనికి కారణం ఆయన జిజ్ఞాస, అలాగే భారతీయ సాంస్కృతిక మూలాలపై గాఢ విశ్వాసం.

మద్రాసులో ఆయుర్వేద కళాశాలను స్థాపించిన దీవి గోపాలాచార్యులవారి వద్ద ఆయన శిష్యరికం చేశారు. ఆయుర్వేదం కేవలం మూలికల వైద్యం కాదు, అది జీవన శాస్త్రమనే భావాన్ని ఆయన లోతుగా గ్రహించారు.

పండిత దీవి గోపాలాచార్యులవారి మరణం తరువాత ఆయన బాధ్యతలన్నీ తన భుజాలమీద వేసుకున్నారు. 1920లో మద్రాసు ఆయుర్వేద కళాశాలకు ప్రిన్సిపల్‌గా నియమితులయ్యారు. విద్యార్థులకు ఆధునిక శిక్షణతోపాటు భారతీయ వైద్యశాస్త్రం గొప్పతనాన్ని వివరించి బోధించారు. ఈ విధంగా అలోపతి–ఆయుర్వేదాల మధ్య వంతెన వేసిన ప్రథములు ఆయనే. ఆయన శ్రద్ధ వల్ల జర్మనీ, అమెరికా వంటి దేశాల నుండి



విద్యార్థులు ఆయుర్వేదాన్ని నేర్చుకోవడానికి వచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో ఆయుర్వేదాన్ని పరిచయం చేసిన వైద్యవిద్యావేత్త ఆయనే!

ఆయన కేవలం వైద్యచికిత్సకే పరిమితం కాలేదు; రచయిత, పరిశోధకుడు, సంపాదకుడిగా కూడా వెలుగొందారు. ధన్వంతరి (తెలుగు పత్రిక), ఆంధ్ర మెడికల్ జర్నల్ (ఇంగ్లీష్) లకు సంపాదకులుగా వ్యవహరించారు.

6కి పైబడిన గ్రంథాలు వ్రాశారు. ఆయుర్వేద విజ్ఞాన సర్వస్వము, ఆయుర్వేద శిక్ష, వనౌషధ విజ్ఞానం, భారతీయ విజ్ఞానం, దర్శనములు వంటి గ్రంథాలు ఆయుర్వేదాన్ని ప్రజలకు సులభంగా చేరువచేశాయి. ఇంగ్లీషులో కూడా అనేక పుస్తకాలు వ్రాసి విదేశీ పాఠకులను ఆకట్టుకున్నారు. వాటిలో కొన్ని ఆర్కయివ్సులో దొరుకుతున్నాయి చూడవచ్చు.

మొదటి భార్య సీతమ్మ అకాలమరణం చెందిన తరువాత ఆయన రుక్మిణమ్మను వివాహం చేసుకున్నారు. రుక్మిణమ్మ ఉప్పు సత్యాగ్రహ సమయంలో మద్రాసులో అరెస్టయిన తొలి మహిళ. స్వాతంత్ర్యం తరువాత మద్రాస్ రాష్ట్రానికి ఆరోగ్య మంత్రిగా పనిచేశారు. దంపతులు ఇద్దరూ ఆరోగ్యరంగానికి విశేషమైన సేవలను అందించారు.

లక్ష్మీపతిగారు అఖిల భారత ఆయుర్వేద వైద్య సమాజం అధ్యక్షుడుగా, ఆంధ్ర ఆయుర్వేద బోర్డు అధ్యక్షుడుగా, ఆంధ్ర సాహిత్య పరిషత్తు (మద్రాసు) కార్యదర్శిగా పనిచేశారు.

గోపాలాచార్యులవారు ఆరంభించిన ఆయుర్వేదప్రచారోద్యమాన్ని ఆయన ఆగకుండా కొనసాగించారు.


ఆయన కృషిని గౌరవిస్తూ చెన్నైలో అనేక వైద్యసంస్థలకు ఆయన పేరు పెట్టి గౌరవించారు. ఆచంట లక్ష్మీపతి యూనిట్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ మెడిసిన్, వి.హెచ్.ఎస్., చెన్నై, ఆచంట లక్ష్మీపతి న్యూరో సర్జికల్ సెంటర్, వి.హెచ్.ఎస్., చెన్నై లాంటి అనేక సంస్థలున్నాయి. విజయవాడ నోరి రామశాస్త్రి ఆయుర్వేద కళాశాలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రికి డాబబ ఆచంట లక్ష్మీపతి పేరును పెట్టి ఆయన్ను గౌరవించారు.

ఆయన ఆత్మకథ "స్వీయచరిత్ర" ఒక వైద్యశాస్త్రజ్ఞుని ఆత్మవిమర్శ మాత్రమకాక, భారతీయ వైద్యపరంపరపై అచంచలమైన విశ్వాసానికి నిలువెత్తు సాక్ష్యం.

దీవి దేశికాచార్యులవారే వారసులు

గోపాలాచార్యులవారి చిన్నతమ్ముడు దేశికాచార్యులు. అన్నగారి కళాశాలలోనే ఆయుర్వేదం చదువుకున్నారు. ఆయుర్వేద మార్తాండ అని బిరుదు పొందారు. పండిత దీవి గోపాలాచార్యులవారి కుమారుడు, అల్లుడూ కూడా చిన్నవయసులోనే చనిపోవటంతో ఈ దేశికాచార్యులవారే గోపాలాచార్యులవారికి చేదోడువాదోడుగా ఉన్నారు. ఆచంట లక్ష్మీపతి

గారి తరువాత ఆయన నిర్వహించిన బాధ్యతలను కూడా దేశికాచార్యులవారే నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్‌గా కూడా వ్యవహరించారు.



ఆచంట లక్ష్మీపతిగారు జీవించి ఉన్నప్పుడే పార్మసీ నిర్వహణాబాధ్యతల్ని దేశికాచార్యులవారే వహించారు.

చెన్నపట్టణం 1926 జనవరి 25 ఆంధ్రపత్రికలో ఒక ప్రకటన దేశికాచార్యులవారి పేరుతో వెలువడింది. ఇది ఉచిత ఆయుర్వేద శిబిర నిర్వహణకు సంబంధించినది:

వైద్యరత్న పండిత, డి. గోపాలాచార్యులవారి అయుర్వేద ఆశ్రమము పోస్టు బాక్సు నం 287 మద్రాసు

ఉచితము... సలహా ఉచితము...

డాక్టరు ఏ. కనకరత్నము ఏ. ఎమ్. ఏ. సి, (హానరరి డిమాన్'స్ట్రేటర్ ఇన్ అనాటమీ,

గవర్నమెంటు ఇండియన్ మెడిసిన్ స్కూల్, మద్రాసు , శ్రీయుత డి. గోపాలాచార్యులవారి శిష్యుడు)

వారు రోగులను పరిక్షించి సలహా ఉచితముగా నిచ్చెదరు,

సలహా నిచ్చుకాలము ఉదయం 7 గం–10 గంటలవరకు 151 గోవిందప్పనాయక వీధి

సాయంత్రము 5 గం–7 గంటలవరకు 188 (బ్రాడ్వే, మద్రాను,)

క్యాటలాగు కావలసినవారు వ్రాసిన ఉచితముగా పంపబడును,

డి దేశికాచార్యులు

(గతించిన పండితులుగారి సోదరుడు మేనేజింగు ప్రొప్రైటర్)

ఈ ప్రకటనను బట్టి ఆచంట లక్ష్మీపతిగారు జీవించి ఉన్న కాలంలో ఫార్మశీ వ్యవహారాలు దేశికాచార్యులవారే పర్యవేక్షించే వారని అర్థం అవుతోంది.

ఆయన ఇద్దరు కుమారుల్లో పెద్దకుమారుడికి గోపాలాచార్యులు అనే పేరు పెట్టుకున్నారు. రెండో కుమారుడు శ్రీనివాసన్.

దేశికాచార్యులు 1954లో మరణించారు. 10 నవంబర్ 1954 ఆంధ్రపత్రికలో ఆ సోదరులిద్దరూ తమ తండ్రి దేశికా చార్యుల మరణానికి చింతిస్తూ సంతాప సందేశాలను పంపిన శ్రేయోభిలాషులందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఒక ప్రకటన ఇచ్చారు.



చివరగా ఒక మాట

డా లక్ష్మీపతి గారన్నట్టు, "అందరికీ దీర్ఘాయువు కలిగే సదుపాయం బోధించే శ్రీ గోపాలాచార్యులవారు తాను మాత్రం అకాల మృత్యువుకు బలి అయ్యారు. ఏ అవయవం మీద కణితి వస్తే ప్రమాదకరమైనదని ఆయుర్వేద సంహితల్లో పేర్కొన్నారో ఆ అవయవం పైనే తనకు కణితివచ్చిందని తన మరణం తథ్యమని ఆయన ముందుగానే ప్రకటించారు. తన చిన్ననాటి స్నేహితుడు కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు తన ఇంటికి వచ్చినప్పుడు ఆ విషయాన్ని చెప్పారు కూడా! ఇంకా ఎక్కువ సమయం లేదు విడిచి వెళ్ళవద్దన్నా రంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు!

29–09–1920న పండిత దీవి గోపాలాచార్యులవారు వైకుంఠ యాత్ర చేశారు. బహుముఖీనమైన వ్యక్తిత్వం కలిగిన ఒక మహనీయుని జీవితాన్ని కేవలం ఆయుర్వేద వైద్యుడనే కోణం లోంచి మాత్రమే విశ్లేషించటం, దేశం కోసం జాతి కోసం స్వాతంత్ర్యం కోసం ఆయన పడిన శ్రమ, తపన దీక్షల్ని పట్టించుకోకపోవటం ఆ మహనీయుడికి అన్యాయం చేయటమే అవుతుంది.

సాక్షాత్తూ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకులలో ఒకరైన తెలుగుబిడ్డ అనంతాచార్లుగారికి గోపాలాచార్యులవారు ప్రీతిపాత్రుడు.

గోపాలాచార్యులవారు స్వతహాగా మితవాది. కానీ ఆ నాటి కాంగ్రెసులో అతివాదులుగా పేరుపడిన లాలాలజపతిరాయ్, బాలగంగాధర తిలక్ బిపిన్ చంద్రపాల్ లాల్–బాల్–పాల్ త్రయానికి ఆయన సన్నిహితుడు.

నోరున్న ఆ ముగ్గురిచేత దేశీయతలో భాగంగా దేశీయ వైద్యవిధానాన్ని దేశభక్తితో కూడుకున్న కార్యంగా ప్రచారం చేయించ గలిగారాయన. కాంగ్రెస్ కార్యకలాపాల్లో దేశీయ వైద్య పరిరక్షణ కూడా ఒకటి. బ్రిటిష్ ప్రభుత్వం ఆయుర్వేదానికి సముచిత స్థానం ఇవ్వటానికి తలఒగ్గిందంటే జాతీయోద్యమం గొంతెత్తటమే ముఖ్య కారణం.

మద్రాసులో సాహితీ సాంస్కృతిక జాతీయోద్యమ రంగాలన్నింటా గోపాలాచార్యుల పాత్ర ఉంది. ప్రకాశం గారితో ప్రారంభించి జాతీయ నాయకులందరితోనూ ఆయనకు సాన్నిహిత్యం ఉంది.

ఆయుర్వేదాన్ని ఆ రోజున ఆయన బతికించారు కాబట్టే ఇవ్వాళ నాబోటి ఆయుర్వేద వైద్యులు ఆయుర్వేదాన్ని వృత్తిగా చేసుకుని జీవిక కొనసాగించగలుగుతున్నాము. దేశీయతనీ దేశీయ వైద్యాన్నీ కాపాడిన ఆ సంరక్షకుడికి ఈ పుస్తకం ఒక నివాళిగా సమర్పిస్తున్నాను.

ఆయన మరణించిన 105 యేళ్ల తరువాత ఆయన జన్మస్థలిలో వారి విగ్రహ ప్రతిష్ఠాపన

జరగటం విశేషం, ఆలస్యం అయితేనేం అసలంటూ పని జరిగింది. దివి మణిదీపాలు, దీపస్తంభాలు, తేజోమూర్తులూ అయిన ప్రముఖుల జ్ఞాపకాలను ఇలా విగ్రహాల రూపంలో పదిలపరచి, ఆ మహనీయుల స్ఫూర్తిని భావి తరాలకు అందించాలనే లక్ష్యంతో కృషి చేస్తున్న మాన్యులు మండలి బుద్ధప్రసాద్ గారికి ఒక ఆయుర్వేద వైద్యుడిగా వందనాలు చెప్పుకుంటున్నాను.

భారతీయత అంతా భారతీయ వైద్యంలోనే ఇమిడి ఉంది. భారతీయుల జీవన విధానం ఆయుర్వేదాన్ని అనుసరించి రూపొందింది. ఈ రోజున మన కట్టూ బొట్టూ, నడక, నడత, తిండీ తిప్పలన్నీ ఆయుర్వేదాన్ని అనుసరించే రూపొందాయి. మనలో కొందరు అప్పుడప్పుడూ విదేశీ వ్యామోహం ప్రదర్శించినా మన జీవాణువులు ఆయుర్వేదాన్ని మాత్రమే అనుసరించగలుగుతాయి.

ఆయుర్వేద మార్తాండుడు పండిత దీవి గోపాలాచార్యుల వారి స్ఫూర్తి కొనసాగాలని ఆశిద్దాం!

★★★



